



# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 23-09-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 46 సంచిక : 11 పేజీలు : 8 వెల : 1 రూపాయి


# ఇళ్ల పట్టాల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలి

◆ లబ్ధిదారులకు లే అవుట్ల వారీగా వివరాలు అందించాలి ◆ పెండింగ్ దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలి

◆ పావలా వడ్డీకే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేలా చూడాలి

**స్పందన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**



అమరావతి: నెల రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీపై కోర్టుల్లో పెండింగ్ కేసులన్నీ పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు లే అవుట్ల వారీగా వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం స్పందన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెండింగ్ దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకంలో రిజిస్ట్రేషన్ పట్టాలిచ్చే కార్యక్రమం డిసెంబర్‌లోగా చేయాలన్నారు. లే అవుట్లలో విద్యుత్, నీటి వసతిపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. మహిళలకు రూ.35 వేలు పావలా వడ్డీకే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేలా చూడాలని పేర్కొన్నారు. వారానికొకసారి ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్లు సమీక్ష చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

**హౌసింగ్:**

నెల రోజుల్లో ఈ కేసులన్నీ పరిష్కారమవుతాయని ఆశిస్తున్నానని సీఎం జగన్ తెలిపారు. పెండింగ్ కేసుల్లో 395 కేసులు తాత్కాలిక స్టేలు ఉన్నాయని చెప్పారు. వాటిపైన కూడా దృష్టిపెడితే.. పేదలకు మేలు జరుగుతుందని, లే అవుట్ వారీగా, ప్లాట్ల వారీగా లబ్ధిదారుల వివరాలను తెలియజేస్తూ మ్యాపింగ్ చేశామని అన్నారు. ప్రభుత్వం తయారు చేసిన యాప్‌లో ఈ వివరాలన్నింటినీ ఉంచాలని తెలిపారు. లే అవుట్ల వారీగా వివరాలు తెలపాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. దాని వల్ల మిగిలిన ప్లాట్లను కొత్తగా లబ్ధిదారులకు కేటాయించడానికి వీలు కలుగుతుందన్నారు. మిగిలిపోయిన 12.6 శాతం మ్యాపింగ్ పనులను కలెక్టర్లు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల కోసం పెట్టుకున్న దరఖాస్తుల్లో పెండింగ్ ఉంటే వెంటనే వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు.

**జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం**

లబ్ధిదారులకు ఇదివరకే ఉన్న లే అవుట్లలో 45,600 మందికి, ప్రభుత్వ లే అవుట్లలో 10,851 మందికి డిసెంబర్‌లో పట్టాలు అందించాలన్నారు. 1,48,398 మందికి పట్టాలు ఇవ్వడానికి కొత్తగా భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ పథకానికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంగా పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ పథకంలో రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చే కార్యక్రమం కూడా డిసెంబర్‌లో చేయాలని తెలిపారు. పేదలందరికీ ఇళ్ల పథకలో భాగంగా మొదటివిడతలో 15.6 లక్షల ఇళ్లు కడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 10.31 లక్షల ఇళ్లు గ్రౌండ్ అయ్యాయని, అక్టోబరు 25 నాటికల్లా బిలో బేస్‌మెంట్ లెవల్ ఇళ్లను బేస్‌మెంట్‌లెవల్‌పై స్థాయికి తీసుకువచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆప్షన్-3 ని ఎంపిక చేసుకున్న ఇళ్ల పనులు అక్టోబరు 25 నుంచి మొదలుపెట్టడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులతో కలిపి గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే 2.25 లక్షల లబ్ధిదారులతో 18,483 గ్రూపులు ఏర్పాటు చేశారని, ఈ నెలాఖరు కల్లా గ్రూపుల ఏర్పాటు పూర్తికావాలన్నారు. లే అవుట్లలో నీటి వసతిని ఏర్పాటు చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. మిగిలిపోయిన లే అవుట్లలో విద్యుత్తు, నీటి వసతిని కల్పించడంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. సిమెంటు, బ్రిక్స్, ఐరన్ స్టీల్, మెటల్.. వాటి వినియోగం విపరీతంగా పెరుగుతుందని, ఆర్థిక

తరువాయి 2లో..

## జగనన్న ఇళ్ళ నిర్మాణాలను
# వేగవంతంగా పూర్తి చేయాలి



విశాఖపట్నం : నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పోలీస్ అధికారులతో రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా జగనన్న కాలనీలు ,అర్హులైన వారికి 90 రోజుల్లో ఇళ్లస్థలాలు మంజూరు ,వన్టైమ్ సెటిల్మెంట్, జగనన్న స్మార్ట్ టౌన్షిప్, ఇళ్ల పట్టాల పంపిణీ, ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ పనులు, లేబర్ బడ్జెట్, గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్స్, వైయస్సార్ హెల్త్ క్లినిక్స్,అర్బన్ హెల్త్ క్లినిక్స్, దిశా యాప్ డౌన్లోడ్ కార్యక్రమం, వ్యవసాయం, covid 19, సీజనల్ వ్యాధులు, అక్టోబర్ మాసంలో ప్రారంభించే పథకాలు తదితర అంశాలపై సవివరంగా మాట్లాడారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ - జూన్ మాసాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకానికి సంబంధించి వెరిఫికేషన్ చేయడంతోపాటు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ మాసంలో బీజగనన్న

సంపూర్ణ గృహ హక్కు పథకం ప్రారంభించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 25 వ తేదీ నాటికల్లా గృహ నిర్మాణాలకు సంబంధించి బేస్మెంట్ లెవెల్ లను పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల వద్ద బోర్ వెల్స్ వేసి నీటి అవసరం కల్పించాలన్నారు. బిల్డింగ్ మెటీరియల్ ను నిల్వ చేయడానికి టెంపరరీ గోడౌన్ ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రతివారం లే అవుట్ల పనుల పురోగతిని పరిశీలన చేయాలన్నారు. డిసెంబర్ 31 నాటికి డిజిటల్ లైబ్రరీ ల

తరువాయి 2లో..



# యువత ఆవిష్కర్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

*- దీనికి అవసరమైన వ్యవస్థను నిర్మిస్తాం*

*- ఉత్తరాంధ్ర యువతకు ఉపయుక్తంగా ఐసిసి పనిచేయాలి*

*- వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి*



ఆంధ్రాయూనివర్శిటీ : రాష్ట్ర యువత ఆవిష్కర్తలుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఆంధ్రయూనివర్సిటీ ఇనిస్టిట్యూషన్స్ ఇనోవేషన్ కౌన్సిల్ ప్రథమ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ రిస్క్ తీసుకునే మనస్తత్వం, మానసిక స్థైర్యం యువత కలిగి ఉండాలన్నారు. తరగతిగది నుంచి విద్యార్థులను ప్రోత్సహిస్తూ వాస్తవిక సమాజ పరిస్థితులు, సమస్యలను వారికి తెలియజేసి వాటిపై పనిచేయాలన్నారు.నూతన అంశాలపై ఆసక్తి, ఉత్సుకత కలిగి ఉండాలన్నారు. వీరికి

తరువాయి 2లో..

# వ్యాక్సినేషన్‌లో ఏపీ మరో ఘనత

అమరావతి: కరోనా వ్యాక్సినేషన్‌లో ఆంధ్రప్రదేశ్ మరో ఘనత సాధించింది. రాష్ట్రంలో రెండు కోట్ల మందికి పైగా మహిళలకి వ్యాక్సినేషన్ వేశారు. ౦౦

౦౦౦దీంతో దేశంలోనే మహిళలకి అత్యధికంగా వ్యాక్సినేషన్ వేసిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 3.83 కోట్ల మంది వ్యాక్సిన్ తీసుకున్నారు.






# క్రీడాకారిణికి కవిత కు చొక్కాకుల ఆర్థిక సాయం



విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ జీవీఎంసి పరిధి సింగరాయి మెట్ట, మురళీనగర్ కు చెందిన దినసరి కూలి పరవాడ గోవింద కుమార్తె పరవాడ కవిత ఆంధ్రప్రదేశ్ తరుపున, ఆగష్టు 15 నుండి 17 వరకు కలకత్తా లో జరిగిన జాతీయ చెస్ బాక్సింగ్ పోటీలో పాల్గొని సిల్వర్ మెడల్ ను సాదిందించి. ఈ సంవత్సరం ఇటలీ లో జరగబోయే ప్రపంచ చెస్ బాక్సింగ్ కు హర్హత సాధించిన పరవాడ కవితకు చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అద్యక్షులు చొక్కాకుల వెంకటరావు తన ట్రస్ట్ ద్వరా "పదివేల" రూపాయలు ఆర్ధిక సాయం చేసారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకట రావు మాట్లడుతూ మట్టిలో మాణిక్యాలు, ఇలాంటి ప్రతిభాగలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తే మన రాష్ట్రానికే కాక దేశానికి పేరుప్రతిష్టలు తీసుకు వస్తారన్నారు . అలాగే ప్రపంచస్థాయిలో జరుగబోయే పోటీలో మనదేశము తరుపున పాల్గొనబోయే కవిత బంగారు పథకం సాధించాలని మన అందరం ఆశిద్దాం. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామకృష్ణ , ఝాన్సి, గోవింద పాల్గొన్నారు .

# ఈనెల 25 న ఆన్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్ల విడుదల

*- దర్శనానికి వచ్చే భక్తులు రెండు డోసుల వ్యాక్సిన్ పూర్తయిన*

*- సర్టిఫికెట్ లేదా కరోనా నెగిటివ్ సర్టిఫికెట్ తేవాలి*

*- టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి*



తిరుమల / తిరుపతి : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం సెప్టెంబర్ 25 వ తేదీ ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో సర్వ దర్శనం టోకెన్లు విడుదల చేస్తామని లిటీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 26వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ దాకా రోజుకు ఎనిమిది వేల సర్వ దర్శనం టోకెన్లు ఆన్లైన్లో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. సర్వదర్శనం టోకెన్లు ఆన్లైన్లో అందుబాటులోకి వచ్చిన తర్వాత, సెప్టెంబరు 26 వ తేదీ నుంచి తిరుపతి లో ఆఫ్ లైన్లో సర్వదర్శనం టోకెన్ల జారీని నిలిపి వేస్తామని ఆయన తెలిపారు. తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సర్వదర్శనం టోకెన్ల కోసం గుమికూడుతుండటం

తరువాయి 2లో..

# మెగా సీటీగా విశాఖ

## - ఘనంగా విజెఎఫ్-సిఎంఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం - ఉత్సాహాభరితంగా సాగుతున్న జర్నలిస్టుల క్రీడలు



విశాఖపట్నం : విశాఖ నగరాన్ని మెగా సీటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. విశాఖ పోర్టు స్టేడియంలో బుధవారం వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్,విస్టా సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్ మీడియా క్రికెట్ టోర్నీకి ఎంపీ ఎంవీవీ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు, ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ పరిపాలన రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో అనేక నూతన పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు.తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మూడు దశబ్దాలకు పైగా సభ్యులకు సంక్షేమ కార్య క్రమాలతో పాటు జర్నలిస్టుల క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఇతర ప్రాంతాలకు ఆదర్శనీయమన్నారు. విజెఎఫ్ చేపడుతున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

గౌరవ అతిథిలుగా హాజరైన నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు మాట్లాడుతూ నగరాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అత్యంత ప్రసంశనీయమన్నారు.జర్నలిస్టుల సహకరారంతోనే తామంతా రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరుకోగలిగామన్నారు. జీవీఎంసీ స్మార్ట్ సీటీ కార్పొరేషన్ చైర్మన్ జివి వెంకటేశ్వరరావు(జీవీ) మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో కొనసాగే జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జర్నలిస్టుల క్రీడలు పూర్తిస్థాయిలో విజయవంతం కావాలని అతిథులు శుభా కాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజెఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, ఎస్, దుర్గారావులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా తామ పాలకవర్గం పనిచేస్తుందన్నారు. విద్య, వైద్యంతో పాటు క్రమం తప్పకుండా రాష్ట్ర, జిల్లా స్థాయి ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహించిన ఘనత విజెఎఫ్‌కే దక్కుతుందన్నారు. దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమ సంఘాలకు ఆదర్శవంతంగా విజెఎఫ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. విజెఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్‌బాబు, సభ్యులు దొండా గిరిబాబు, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఇరోతి ఈశ్వరరావు, ,పైలా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

**- ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం**

పోర్టు మైదానంలో ప్రారంభమైన విజెఎఫ్ క్రికెట్ పోటీలను ఎంపీ ఎంవీవీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎంవీవీతో పాటు కెకెరాజులు, జీవీలు కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు.



## ధాన్ పౌండేషన్ ఆధ్వర్యంలో 'మోడల్ వార్డు' కార్యక్రమాన్ని ప్రారంభించిన నగర మేయర్



విశాఖపట్నం :- నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ధాన్ పౌండేషన్ ఆధ్వర్యంలో "మోడల్ వార్డు" కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం ఆమె జివిఎంసి పాత సమావేశ మందిరంలో "మోడల్ వార్డు" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని కొన్ని వార్డులను ఎంపిక చేసి, వాటిని దత్తత తీసుకొని అక్కడ ప్రజలకు మౌలిక వసతులు, వారి జీవన విధానం, సామాజిక పెట్టుబడి, సుస్థిర అభివృద్ధి లాంటి కార్యక్రమాలలో ధాన్ పౌండేషన్ చేపడుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజల ఆరోగ్యం కొరకు ఉచిత పరీక్షలు, సలహాలు ఇవ్వాలని, యువత మంచి మార్గంలో నడిచేందుకు సూచనలు, డ్రగ్స్ పై అవగాహన, మగ, ఆడ పిల్లలు ఎలా ఉండాలి అనే జాగ్రత్తలు చెప్పడం, ఇతరులతో మాట్లాడే విధానం నేర్పడం, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ కొరకు పిల్లలకు తెలపడం, దిశ యాప్ డౌన్లోడ్ చేయడం వంటి కార్యక్రమాలు విస్తృతంగా వార్డులలోనూ, పాఠశాలలోనూ పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న పౌండేషన్ వారిని అభినందించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్(యుసిడి) వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ, సేవ, ప్రభుత్వేతర సంస్థలతో కలిసి ధాన్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఐదు వార్డులే కాకుండా, 92 వార్డులలో ఇటువంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుందని తన అభిప్రాయాన్ని ధాన్ పౌండేషన్ కు తెలియపరిచారు. రీజనల్ కో-ఆర్డినేటర్ రమాప్రభ మాట్లాడుతూ, జివిఎంసిలో గత 23 సం. రాల నుండి మహిళలకు పొదుపు, అప్పు లాంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని, శక్తివంతమైన కమ్యూనిటీ లీడర్లను ప్రతిష్టమైన అభివృద్ధి, స్వయంనియంత్రణ కలిగిన పొదుపు సంఘాలకు అవగాహన, పేదరిక నిర్మూలన, ముఖ్యంగా మహిళలకు ఆర్థికంగా పైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్దెల రామలక్ష్మి (10వ వార్డు), నోల్లి నూకరత్నం (19వ వార్డు), గంకల కవిత(48వ వార్డు), సమాఖ్యల నాయకులు గౌరి, వెంకట రత్నం, ఉషారాణి, ఉమా మహేశ్వరీ, దివ్య, యు.సి.డి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త బంద్ ను జయప్రదం చేయాలి

### - అఖిల పక్ష కార్మికుల సంఘాల పిలుపు



గాజువాక : కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నెల 27 వ తేదిన తలపెట్టిన దేశ వ్యాప్త బంద్ ను విజయవంతం చేయాలనీ అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. గాజువాక సిపిఎం కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి సుబ్బారావు ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక సంఘ ముఖ్య సభ్యులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం. బుధవారం నిర్వహించిన ఈ సమావేశంలో వైసీపీ పార్టీ తరపు నుండి నియోజకవర్గ ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో అవినీతిని నిర్మూలిస్తాం ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రగామి దేశంగా ముందుకు తీసుకెళ్తామని ప్రగల్భాలు పలికిన మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు అమ్మేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం వలన రిజర్వేషన్లు కనుమరుగవుతాయని తెలిపారు.

సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఏడేళ్ల పరిపాలనలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సుమారు 30 లక్షల కోట్ల రూపాయలను అదనంగా ప్రజలపై మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరిశ్రమలు మౌలిక సదుపాయాల అభివృద్ధి లో కానీ నిర్మాణం లో కానీ వీసమెత్తు పాత్ర లేని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ సంస్థలను ఏ విధంగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బడుగు బలహీన వర్గాలకోసం పనిచెయ్యాల్సిన మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఎర్రతివాచీ పరుస్తోందని విమర్శించారు.

దేశాన్ని బిజేపి ప్రభుత్వ కబందహస్తాలనుండి కాపాడుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందుకు ఈ నెల 27వ తేది సోమవారం తలపెట్టిన భారత్ బంద్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఎం రాంబాబు, రాజేంద్రప్రసాదు, కీరీటం, సంతోషం, రమణ, విష్ణు, జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### జగనన్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

నిర్మాణాలకులొకేషన్లను గుర్తించి గ్రౌండింగ్ మొదలు పెట్టాలన్నారు. వాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసి శతశాతం పూర్తి చేయాలన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి జిల్లాస్థాయి వ్యవసాయ అడ్వైజరీ కమిటీ సమావేశాలను నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జున, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ,నగర పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా , ఎస్ పి బి .కృష్ణా రావు, జీవీఎంసీ కమిషనర్ జి సృజన, హౌసింగ్ జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తదితరులు హాజరయ్యారు.

### ఈనెల 25 న ఆన్లైన్లో సర్వదర్శనం టోకెన్ల విడుదల

వల్ల కరోనా వేగంగా సంక్రమించే ప్రమాదం ఉన్నందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు రెండు డోసుల వ్యాక్సిన్ వేయించుకున్న సర్టిఫికెట్ కానీ, దర్శనం సమయానికి మూడు రోజుల ముందు కరోనా పరీక్ష చేయించుకుని తెచ్చుకున్న నెగెటివ్ సర్టిఫికెట్ గానీ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని చైర్మన్ గారు వివరించారు. కోవిడ్ నియంత్రణ కోసం టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయానికి భక్తులు సహకరించాలని వైవి సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. అక్టోబరు నెలకు సబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ 300 టికెట్లు సెప్టెంబరు 24వ తేదీ ఉదయం 9 గంటలకు ఆన్లైన్ లో విడుదల చేస్తామని చైర్మన్ గారు తెలిపారు.

## జీవో 217 రద్దు చేయాలంటూ వినతి...



కంచరపాలెం : మత్స్యకారుల జీవన విధానానికి నష్టం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 217 ను తక్షణం రద్దు చేయాలంటూ జాయింట్ డైరెక్టర్ ఫిషరీస్ కి విశాఖపట్నం పార్లమెంటు జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి అధ్యక్షతన బుదవారం వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ మత్స్యకార నాయకులు రాష్ట్ర మత్స్యకార సెల్ సభ్యులు సూరాడ రాజు, జిల్లా కార్యదర్శి ధానేష్ (శ్రీరంగం దానేశ్వర రావు), కోనాడ నాగమణి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కదిరి రాము, చెల్లూరి చిన్నారావు, వాసుపల్లి రామారావు, మోసా చంద్రమౌళి, వాడమొదులు నూకరాజు, బడే విజయ్, సూరాడ చంద్రశేఖర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఇళ్ల పట్టాల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలి

వ్యవస్థ ఊపందుకుంటుందని తెలిపారు. ఆప్షన్ - 3 ఎంచుకున్న ప్రాంతాల్లో 1.75 లక్షలకే ఇంటి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు రూ.35 వేలు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని తెలిపారు. బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారికి రుణాలు అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్లు వారానికి ఒకసారి ఇళ్ల నిర్మాణంపై సమీక్ష చేయాలన్నారు. మున్సిపాలిటీ స్థాయి, మండలాల స్థాయి, పంచాయతీల స్థాయి, లే అవుట్ స్థాయిల్లో కూడా సంబంధిత అధికారులు ఇళ్ల నిర్మాణ ప్రగతిపై రివ్యూ చేయాలన్నారు. అలా చేయగలిగితేనే వేగంగా నిర్మాణాలు సాగుతాయని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తేనే అక్కడ సమస్యలు ఏంటో తెలుస్తాయన్నారు. పెద్ద లే అవుట్లలో నిర్మాణసామగ్రిని ఉంచడానికి, సైట్ ఆఫీసులకోసం గోడౌన్లను నిర్మించాలని తెలిపారు. ఉపాధిహామీ పనుల కింద ఈ గోడౌన్లను నిర్మించాలని సీఎం పేర్కొన్నారు.

**ఉపాధి హామీ**

సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, బీఎంసీయూలు, డిజిటల్ లైబ్రరీల పనులు చురుగ్గా సాగాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం ఇవ్వని బిల్లులకు సంబంధించి ఇప్పుడు ప్రభుత్వం ఇవ్వాల్సి వస్తోందని, కేంద్రం నుంచి వచ్చిన డబ్బు కన్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికంగా ఖర్చు చేశామని తెలిపారు. నిధులకు ఇబ్బంది లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైన కూడా దృష్టి పెడుతున్నామని తెలిపారు. కలెక్టర్లు ఈ పనులపై దృష్టిపెట్టి ముందుకుసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**డిజిటల్ లైబ్రరీలు**

డిసెంబర్ 31 నాటికల్లా 4,530 పంచాయతీల్లో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వస్తోందని తెలిపారు. అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్, వర్క్ ఫ్రం హోం సౌకర్యం గ్రామాల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆలోగా డిజిటల్ లైబ్రరీలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

విలేజ్, వార్డు సచివాలయాల్లో తనిఖీలు

విలేజ్, వార్డు సచివాలయాల్లో తనిఖీలు చాలా ముఖ్యమైనవని, అలసత్వం వహించిన వారిపై చర్యలకూ వెనుకాడమని సీఎం జగన్ అన్నారు. కలెక్టర్లు ప్రతివారం 2 సచివాలయాలు, జాయింట్ కలెక్టర్లు వారానికి 4 సచివాలయాలు, మున్సిపల్ కమిషనర్లు, ఐటీడీఏ పీఓలు, సబ్ కలెక్టర్లు వారానికి నాలుగు సచివాలయాలను తప్పని సరిగా సందర్శించాలన్నారు.

స్వయంగా రంగంలోకి సీఎం

వచ్చే నెల నుంచి ఎమ్మెల్యేలు కూడా వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించాలని చెబుతామని సీఎం జగన్ అన్నారు. డిసెంబర్ నుంచి తాను కూడా సచివాలయాలను సందర్శిస్తూ ప్రతి పర్యటనలో సచివాలయాలను చూస్తానని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన చేస్తున్న సమయంలో ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో మార్గదర్శకాలు కూడా ఇచ్చామని పేర్కొన్నారు.ప్రతి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిపి బృందాలుగా ఏర్పడి ప్రజల్లో అవగాహన, చైతన్యం కలిగించేలా ఆ గ్రామంలో పర్యటించాలని చెప్పామని అన్నారు.

ప్రతినెలా చివరి శుక్రవారం, చివరి శనివారం సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమం, సెప్టెంబరు 24, 25 తేదీల్లో సిటిజన్ అవుట్‌రీచ్ కార్యక్రమం, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, ముఖ్యమైన ఫోన్ నంబర్లతో కూడిన పాంప్లెట్లను వారికి అందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కలిగించాలని తెలిపారు. నిర్దేశించుకున్న రోజుల్లోగా అర్హులైన వారికి మంజూరు జరగాలని సీఎం జగన్ సూచించారు.

కోవిడ్, సీజనల్ వ్యాధులు

కోవిడ్ తీవ్రత తగ్గిందని, ఉధృతంగా ఉన్న కాలంలో పాజిటివిటీ రేటు 25.56 శాతం ఉందని తెలిపారు. ప్రస్తుతం 2.5 శాతం కన్నా తక్కువగా ఉందని, రికవరీ రేటు కూడా 98.63శాతంగా ఉందని పేర్కొన్నారు. కోవిడ్ పట్ల ఎలాంటి అలసత్వం వద్దని, 2 డోసుల వ్యాక్సినేషన్ 100శాతం పూర్తయ్యేంతవరకూ కూడా ఎలాంటి పరిస్థితుల్లో కోవిడ్ పట్ల నిర్లక్ష్యం వద్దని సీఎం అధికారులకు సూచించారు. కోవిడ్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించే వారికి కఠినంగా వ్యవహరించాలని, జరిమానాలు విధించాలని తెలిపారు. మాస్కులు వినియోగించకపోతే కచ్చితంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 104 నంబర్ అనేది వన్‌స్టాప్ సొల్యూషన్‌గా నడవాలని, 104 నంబర్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రతివారం కూడా 104 నంబర్ పనితీరుపై సమీక్ష చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

థర్డ్ వేవ్ సన్నద్ధత

థర్డ్‌వేవ్ వస్తుందో, లేదో తెలియదని కానీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ అన్నారు. టీచింగ్ ఆస్పత్రులు, ఆస్పత్రుల్లో కావాల్సిన పరికరాలను, మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాల్లోని టీచింగ్ ఆస్పత్రులకు జాయింట్ కలెక్టర్ హౌసింగ్‌ను అడ్మిన్ ఇన్‌ఛార్జిగా నియమించాలని అన్నారు. నవంబర్ 15 నుంచి విలేజ్ క్లినిక్స్ నుంచి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో కావాల్సిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. డిప్యుటేషన్లను పూర్తిగా రద్దు చేయాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ డిప్యుటేషన్లకు అనుమతి ఇవ్వొద్దన్నారు. 100 బెడ్లకు మించి ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు ఉంచేలా చూడాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు.

వ్యాక్సినేషన్‌జి

నవంబర్ 30 నాటికి 3.5 కోట్ల మందికి కనీసం ఒక డోసు వ్యాక్సిన్ ఇవ్వగలుగుతామని సీఎ జగన్ అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ప్రజలందరికీ పూర్తిగా 2 డోసులు ఇవ్వగలుగుతామని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్‌పైనా కలెక్టర్లు దృష్టిసారించాలని, రెండో డోసును సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా, టైఫాయిడ్ వ్యాధులపై దృష్టిపెట్టాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు.

దిశ యాప్

దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని, ఫోన్‌ను షేక్ చేస్తే చాలు 6 నిమిషాల్లోగా మహిళకు భద్రత కల్పించేలా దిశ యాప్‌ను తీర్చిదిద్దామని సీఎం జగన్ అన్నారు. దిశ యాప్ ద్వారా మహిళల్లో విశ్వాసాన్ని నింపగలిగామని, 70,00,520 మంది ఇప్పటివరకూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. ఇందులో 3,78,571 ఎస్ఓఎస్ రిక్వెస్టులు వచ్చాయని, ఇందులో చర్యలు తీసుకోదగ్గవి 4,639 అని అన్నారు. మూడు నెలల్లో దాదాపు 900 సక్సెస్ స్టోరీలు దిశ యాప్ ద్వారా ఉన్నాయని తెలిపారు. ఏదైనా జరగకముందే మహిళలకు అండగా నిలిచామని, సగటున 6 నిమిషాల్లోగా దిశ బృందం బాధితులను చేరుకుంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఛార్జిషీటు వేయడానికి సగటున 300 రోజులు పడితే, ఇప్పుడు 42 రోజుల్లోగా ఛార్జిషీటు వేస్తున్నామని చెప్పారు.

## యువత ఆవిష్కర్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

అవసరమైన సహాయ సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి ఉన్నత విద్యకు పెద్దపీటవేస్తూ ప్రోత్రహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న హై ఎండ్ స్కిల్ యూనివర్సిటీలు భవిష్యత్తులో మెరుగైన ఫలితాలను అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉపాధి కోసం వేచిచూడకుండా ఉపాధిని కల్పించే దిశగా యువతను నడిపిస్తామన్నారు. విద్యార్థులు ఆర్థిక పురోగతికి చోదక శక్తిగా నిలుస్తూ, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర విద్యార్థుల అవసరాలు పూర్తిస్థాయిలో నెరవేర్చే దిశగా ఐసిసి పనిచేయాలని సూచించారు. ఏఐసిటిఈ అసిస్టెంట్ ఇనోవేషన్ డైరెక్టర్ దీపన్ సాహు నేషనల్ ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీని విశ్వవిద్యాలయాలలో అమలు జరుపుతున్న విధానం వివరించారు. ఇప్పటికే 428 విశ్వవిద్యాలయాలు ఐఐసి సభ్యులుగా ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్,ఇంక్యుబేషన్‌ను ప్రోత్సహిస్తూ ప్రత్యేక నిధులను, ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ మాట్లాడుతూ ఆవిష్కరణలను వాణిజ్యపరంగా మార్పు చేయడం ఎంతో అవసరమన్నారు. వైవిధ్యమైన ఆలోచనలతో పనిచేయడం ఎంతో అవసరమన్నారు. విజయ గాథలను తెలియజేయడం వలన యువతలో నూతన ఆసక్తి, ఉత్సుకత ఏర్పడతామన్నారు. ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ ఐఐసి అద్యక్షులు డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లడుతూ ఏయూను గ్లోబల్ యూనివర్సిటీగా నిలుపుతామన్నారు. ఐఐసి ఉపాధ్యక్షుడు, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు రానున్న మూడు నెలల కాలంలో చేపట్టే కార్యక్రమాల ప్రణాళిక తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, కె.శ్రీనివాస రావు, టి.శోభశ్రీ, వై.రాజేంద్ర ప్రసాద్, డీన్‌లు ఆచార్య డి.లలిత భాస్కరి, ఆచార్య పి.మల్లి కార్జున రావు, ఐఐసి సభ్యులు, విద్యార్థులు, పరిశ్రమల నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మా పార్టీ అభ్యర్థులను గెలిపించాయి

## - జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము



సబ్బవరం : వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మా పార్టీ అభ్యర్థులను గెలిపించాయని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటన రాము పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అనకాపల్లి రోడ్ లో ఉన్న వైసీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము పాల్గొన్నారు. జెడ్పిటిసి గా తుంపాల అప్పారావు ఎంపీపీ బోకం సూర్యకుమారి వైసీపీ తరఫున ఎన్నికైనట్లు తెలిపారు. ఈ అభ్యర్థులు ఇద్దరిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము మాట్లాడుతూ మా సంక్షేమ పథకాలే సబ్బవరం మండలంలో మొత్తం 19 ఎంపీటీసీలు కి గాను 15 మంది వైసీపీ అభ్యర్థులు గెలుపొందారని, జడ్పిటిసి వైసిపి అభ్యర్థిగా గా తుంపాల అప్పారావు గెలుపొందారు అని అన్నారు. ఎన్నికల ముందు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ లన్నీ తు.చ.తప్పకుండా నెరవేర్చారని అవే కాకుండా అనేక పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. నేడు కొందరు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూచి ఓర్వలేక ప్రభుత్వానికి ఎలాగైనా చెడ్డ పేరు తేవాలని ఉద్దేశంతో ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరో పించారు. ఎన్నికైన జడ్పిటిసి అభ్యర్థి తుంపాల అప్పారావు ఎంపీపీ గా ఎన్నికైన అభ్యర్థి బోకం సూర్యకుమారి మండల ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు కు, వైసీపీ నాయకు లకు, కార్యకర్త లకు, మండల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మమ్మలను గెలిపించినందుకు మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము,తుంపాల అప్పారావు,మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, వనం అచ్చంనాయుడు, జీ.ఎల్ నాయుడు, నూకరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్కే కవచం

# యునిసెఫ్ పోస్టర్ ఆవిష్కరణ

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



యూనిసెఫ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్సిటీ : కరోనా వ్యాప్తి, నిరోధంపై ప్రజలను చైతన్యవతం చేసే దిశగా యూనిసెఫ్ సంస్థ తీర్చిదిద్దిన మాస్కే కవచం పోస్టర్, స్టిక్కర్‌లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. కరోనా నుంచి రక్షించే కవచంగా మాస్క్ నిలుస్తుందని, ప్రజలు బహి రంగ ప్రదేశాలకు వెళ్లే సమయంలో మాస్క్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణ మోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, యూనిసెఫ్ ఎస్‌బిసిసి ప్రోగ్రాం జిల్ల సమన్వయర్త ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రారంభానికి సిద్ధమైన అమెరికన్ కార్నర్

## - వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి

## - హాజరు కానున్న అమెరికన్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మెన్





ఆంధ్రాయూనివర్శిటీ : దేశంలో మూడవది రాష్ట్రంలో తొలి అమెరికన్ కార్నర్ ఈనెల 23న ప్రారంభం కానుంది. గురువారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభిస్తారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం మెదటి అంతస్థులో అమెరికన్ కాన్సులేట్ సౌజన్యంతో అమెరికన్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమెరికన్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మెన్, యూఎస్ ఎయిడ్ మిషన్ డైరెక్టర్ వీణా రెడ్డి, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొంటారు. ఇప్పటి వరకు మన దేశంలో అహ్మదాబాద్, హైదరాబాదులలో మాత్రమే అమెరికన్ కార్నర్‌లు ఉన్నాయి. దేశంలోనే మూడవది పరిపాలనా రాజధానిగా మారుతున్న విశాఖ నగరంలో, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు అవుతోంది. ఈ కేంద్రంలో యువతకు అమెరికా సంస్కృతి, విలువలు, ఉన్నత విద్య అవకాశాలు, ఆంగ్ల భాష నైపుణ్యం, పుస్తకాలు, విద్యా సంబంధ సమాచారాన్ని అందించే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు.ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం మెదటి అంతస్థులో దీనికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, అమెరికా సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో దీనిని తీర్చిదిద్దారు.

# జీవో నెం.217 ను తక్షణమే రద్దు చేయాలి

## ఫిషర్ మెన్ సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్



విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా ఫిషర్ మెన్ సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి అధ్యక్షతన జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో మత్స్యకారుల జీవన విధానాన్ని అస్తవ్యస్తం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినటువంటి జీవో నెం.217 ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారుల వారసత్వ హక్కులను కాలరాస్తూ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.217 ను రద్దు చేయకపోతే భవిష్యత్తులో ఈ ఆందోళన తీవ్రతరం చేస్తామని, భారతీయ జనతా పార్టీ వేదికగా మత్స్యకారులను ఏకం చేసి పోరాడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ విశాఖ పట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ముఖ్య అతిథిగా విచ్చేసి మత్స్యకారుల హక్కులకు విఘాతం కలిగించే జీవో నెం.217 ను రద్దు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ వివిఎస్ఎన్ కొప్పిశెట్టి, జిల్లా ఉపాధ్యక్షురాలు వర్రే లలిత పాల్గొన్నారు.

# గజపతినగరం స్కూల్ కమిటీ చైర్మన్ గా రాపేటి సన్యాసిరావు



నూతన కార్యవర్గం, గ్రామ పెద్దలతో స్కూల్ కమిటీ చైర్మన్ సన్యాసిరావు

చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్ గా రాపేటి సన్యాసిరావు( సన్నీ) ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా దాసరి శ్రావణి ఎన్నికయ్యారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలిజ నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రుల తో కలిసి బుధవారం ఎన్నిక నిర్వహించారు.

ఈ సందర్భంగా

పాఠశాలకు ఎన్నికైన నూతన కార్య వర్గాన్ని గ్రామ సర్పంచ్ మల్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బుద్ధ గంగరాజు, గ్రామ పెద్దలు, స్కూల్ అభివృద్ధి కమిటీ, గ్రామ యువత అభినందించారు. గతంలో 16 మంది విద్యార్థులు ఉండే పాఠశాలను 50 మందికి పైగా విద్యార్థులను సంఖ్యను తల్లిదండ్రులు, స్కూలు అభివృద్ధి కమిటీ, గ్రామ యువత సహకారంతో పెంచడం జరిగిందని, పాఠశాల అభివృద్ధి బాటలో నడిపించేందుకు, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కమిటీ చైర్మన్ గా ఎన్నికైన సన్యాసి రావు తెలిపారు.

# ఘనంగా స్వర్గీయ గాలి శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి



గాజువాక : వైస్సార్.టీ.యూ.సి. నాయకులు కీ.శే.గాలి.శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి 87వ వార్డు పాత వడ్లపూడి లో బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమునకు ముఖ్య అతిథిగా గాజువాక శాసన సభ్యులు తిప్పల. నాగిరెడ్డి,గాజువాక వైస్సార్సీపీ ఇంచార్జ్ తిప్పల. దేవన్ రెడ్డి స్టేట్ యస్. సి.సెల్. సెక్రటరీ మార్డుపూడి. పరదేశి, జిల్లా సెక్రటరీ బొడ్డ గోవింద్ పాల్గొని శ్రీనివాస్ చిత్రపటాముకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమం లో ...

ఆడారి.శ్రీను,పి. సంతోష్, కె. కనకలక్ష్మి. పి.ఆనంద్, జి.నూకరాజు, చిత్రాడ. రాజు,డి.భ్రమ్మం,కె.అప్పలరాజు, పి.ఏ.నాయుడు, జి.నాగరాజు, చిత్రాడ మోహన్, చిత్రాడబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సలహా మండలి సభ్యులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం

భీమునిపట్నం : భీమిలి రైతు భరోసా కేంద్రం లో అర్ బి కె స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించా రు. భూసార పరీక్ష కేంద్రం సహయ సంచాలకులు శ్రీదేవి మాట్లాడుతూ వాతా వరణ పరిస్థితులు పంటల స్థితి గతులు రైతు ఉత్పత్తి దారు సంఘాలు ఏర్పాటు లు మరియు వివిధ పంట ఉత్పత్తులు నాణ్యత ప్రమాణాలు గురించి వివరించారు. భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాదికారి తులసీ మణి మట్టి నమూన సేకరణ పద్ధతి మట్టి నమూన పరీక్ష ఫలితాల విశ్లేషణ గురించి వివరించారు. వ్యవసాయాధికారి సి హెచ్ సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ వివిధ పంటల సాగు పద్ధతులు పంటల కొనుగోలు వై ఎస్ ఆర్ రైతు భరోసా వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాలు రైతు భరోసా కేంద్రం లో మందులు లభ్యత గురించి తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో వ్యవ సాయ సలహా మండలి సభ్యులు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గాజువాక సింహగిరి కాలనీ మండల పరిషత్

## ప్రాథమిక పాఠశాల వైస్ చైర్మన్ గా తర్రా వరహాలురావు



గాజువాక : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పథక సంచాలక సర్వ్ శిక్షా అభియాన్ మెమో ప్రకారం 73 వ వార్డు సింహగిరి కాలనీ గాజువాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు పప్పు పైడయ్య , ఉపాధ్యా యులు విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ సభ్యులు కో ఆప్షన్ సభ్యులు,చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ గా కొత్తర లక్ష్మీ ఎన్నికైయ్యారు. వైస్ చైర్మన్ గా తర్రా వరహాల రావు ఎకగ్రీవంగా ఎన్నికైయ్యారు. సునీత, లోవ కుమారీ, రామలక్ష్మీ, రమ, పర్వీన్, అపర్ణ, ఖాతున్, రామ వెంకట లక్ష్మీ, రాధ, లోవ కుమారి, షేక్ పాజీదా, కె. నాగమణి, సిహెచ్ నాగమణి ఎన్నికైన సభ్యులను 73వ వార్డు కార్పొరేటర్ భూపతి రాజు సుజాత అభినందనలు తెలిపారు.

# పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు



భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డ్ పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాల స్కూల్ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో భీమిలి 3వార్డ్ లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రోత్సహం తో చైర్మన్ గా రాంభుక్త దేవి , వైస్ చైర్మన్ గా వాసుపిల్లి శ్రీదేవి ని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఈ కమిటి సభ్యులు అందరికి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పండిట్ నెహ్రు ప్రాథమికపాఠశాల ప్రధానో పాధ్యాయులు సంగం దొరబాబు, ఉపాధ్యాయులు ఎం రమాదేవి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ హైస్కూల్ లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రధానోపాధ్యాయులు చెట్టి సింహాచలం అధ్యక్షతన జరిగినాయి.పేరెంట్స్ కమిటీ చైర్మన్ గా గొల్తి రేణుక ,వైస్ చైర్మన్ గా కొక్కిరి వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా చిట్టి సింహాచలం , ఎస్ సుజాతకుమారి , వార్డ్ కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఎన్ని కయ్యేరుల్ ఎడ్చర్ల హరి వెంకట స్వామి,గుర్రాల పండరినాథ్ కో ఆప్టెడ్ మెంబర్ లు గా ఎన్నికయ్యారు. సిఆర్.పి.వంశీధర్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు నయీమ్ అన్సారీ అల్లాడ శ్రీనివాసరావు, ఇమంది వెంకట్ రావు రామకృష్ణ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీ

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హోటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ఏర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది. యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేక పోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించు కోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొం దరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

## ఎమ్మెల్సీ మాధవ్ కు స్వరూపానందేంద్ర ఆశీస్సులు



పెందుర్తి : బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ బుధవారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు.


పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు అందుకున్నారు. రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

చాతుర్మాస్య దీక్ష అనంతరం రిషికేష్ నుంచి విశాఖకు తిరిగి వచ్చిన స్వామీజీ నుంచి ఆశీస్సులు తీసుకోవడానికి విశాఖ శ్రీ శారదాపీఠానికి వెళ్లారు.

## విశాఖ శారదా పీఠాధిపతులను కలిసిన టీడీపీ ఎమ్మెల్యే



పెందుర్తి : విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిని టీడీపీ ఎమ్మెల్యే గణబాబు కలిసారు. బుధవారం పీఠంలో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. చాతుర్మాస్య దీక్ష పూర్తి చేసుకుని రెండు రోజుల క్రితమే స్వరూపానందేంద్ర స్వామి విశాఖ చేరుకున్నారు. దీక్షానంతరం విశాఖకు వచ్చిన స్వామీజీ ఆశీస్సుల కోసం ఆయన విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు.



**సబ్బవరం మండలం అంతకాపల్లి ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపొందిన చొక్కాకుల గోవింద ను సీతమ్మధారలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్నా సబ్బవరం మండలం మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకట రావు, మేడపురెడ్డి జగన్నాథం, అయ్యన్నపాలెం సీనియర్ యువ నాయకులు దాసరి నాయుడు తదితరులు.**

## కవి సమయం

### అనర్హులకు అందలమివ్వరాదు

ఒక పని చెయ్యాలంటే ఆ పని చేసేవారికి దానిని పూర్తి చేసే శక్తిసామర్థ్యాలు వుండాలి. అంటే వారు ఆ పని చెయ్యడానికి అర్హులైయుండాలి. ప్రతి ఉద్యోగానికీ ఒక అర్హతను నిర్ణయిస్తారు. కాబట్టి వారు ఆ ఉద్యోగానికి సరిపోతారో లేదో, పని సరిగ్గా చెయ్యగలరా అనేవి పరీక్షించి వారికి ఆ ఉద్యోగం కేటాయిస్తారు. కానీ ఏం చేస్తాడో తెలియకుండా పొందే ఉద్యేగమే రాజకీయ పదవులు, ఒక ప్రజా ప్రతినిధిని మనం ఎన్నుకుంటే అతను ఏం చేస్తాడో తెలియదు. కాబట్టి మనం రాజకీయ నాయకులను ఎన్నుకునేటప్పుడు వారి అర్హతలను గుణగణాలను పరిశీలించి ఎన్నుకోవాలి. కానీ నేడు అధికారంలో, చట్టసభలలో ఉన్న వారిలో సగానికి సగం మంది నేరచరిత్ర కలిగిన వారే. వారు చట్టసభలో కూర్చున్నా తమ సహజ గుణాన్ని వీడకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అటువంటి అనర్హులను అందలమెక్కిస్తే మన దేశప్రగతి ప్రశ్నార్థకంగా మారుతుంది. వారు పంచే డబ్బుకీ, పోసే మద్యానికి తలొగ్గి ఓటు వేస్తే అయిదు సంవత్సరాల పాటు వారు మనతో చెలగాటమాడతారు. కాబట్టి మంచివారిని రాజకీయాలలో ప్రోత్సహించాలి. అనర్హులకు అందలమివ్వరాదని ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునన్
వొనరగ చట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ'


కవితా రచన:
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : తదియ పూర్తి(24-0) **గురువారం**
రేవతిఉ. 6.54; వ.తె.3,55ల 5,38, **23-09-2021**

**మేషం** : మీ శత్రువులే మీకు మిత్రులై సహాయ, సహకారాలను అందిస్తారు. కీలకమైన వ్యవహారాల్లో తీసుకున్న నిర్ణయాల వల్ల కష్టనష్టాలు ఎదుర్కొంటారు. వాహనం నడుపుటలో మెలకువ అవసరం. **వృషభం** : ప్రముఖులు, సన్నిహితుల కలయిక సాధ్యంకాదు. నిరుద్యోగయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఆత్మీయులకు విలువైన బహుమతులు అందిస్తారు. ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్న ప్రమోషన్ అందుకుంటారు. **మిధునం** : అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులకు, జాయింటు వ్యాపారస్తుల శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. గతంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగీ కలిసే అవకాశం ఉంది. నిత్యావసర వస్తు స్టాకిస్టులకు లాభదాయకం. **కర్కాటకం** : మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. ఉద్యోగం చేయు స్త్రీలకు దూరప్రాంతాలకు బదిలీలు అవుతాయి. శస్త్ర చికిత్స చేయునప్పుడు వైద్యులకు ఏకాగ్రత అవసరం. కార్మికులకు, ప్రైవేటు సంస్థలందు పనిచేసే క్రింది ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది. **సింహం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాల గూర్చి తగాదాలు రావచ్చు. ప్రముఖుల ద్వారా ఉద్యోగస్తులు కొత్త పనులు చేపడతారు. కుటుంబంలో ఒకరి ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు అనువైన సమయం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. **కన్య** : నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లకు ఓర్పు, నేర్పు ఎంతో ముఖ్యం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులను అతిగా విశ్వసించటం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది జాగ్రత్త వహించండి. బంధుమిత్రులతో కీలకమైన విషయాలు చర్చలు జరుపుతారు. ఖర్చులు ప్రయోజనకరం. **తుల** :కొన్ని ముఖ్యమైన విషయాల్లో పట్టువిడుపు ధోరణితో వ్యవహరించటం మంచిది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్‌లకు సంతృప్తి, ప్లీడర్లకు చికాకులు తప్పవు. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారులకు మందకొడిగా ఉంటుంది. పారిశ్రామిక, కార్మిక సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. **వృశ్చికం** : ఉత్తర ప్రత్యుత్తరాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారులకు ఆశించినంతగా పురోభివృద్ధి ఉండదు. ఉద్యోగస్తులు పదోన్నతి కోసం చేసే యత్నాలు కొంతవరకు సఫలం అవుతాయి. ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులు ఉద్యోగాలకై చేయు ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. **ధనుస్సు** : స్త్రీలకు అలం కరణలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. ఉద్యోగస్తులు తోటివారి నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఒక ముఖ్య విషయమై న్యాయసలహా పొందవలసి వస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి శుభదాయకం. ప్రైవేటు సంస్థల్లోని వారికి ఊహించని మార్పులు సంభవిస్తాయి. ప్రేమికులు శుభవార్తలు వింటారు. **మకరం** :గృహంలో మార్పులు, చేర్పులకై చేయు ప్రయత్నాలు వాయిదా పడతాయి. కుటుంబీకుల ఆరోగ్యంలో శ్రద్ధ వహిస్తారు. ఒక విషయంలో మీ జీవిత భాగస్వామి సలహా పాటించటంవల్ల కలసి రాగలదు. ఉపాధి పథకాల దిశగా నిరుద్యోగుల ఆలోచనలు ఉంటాయి. విదేశీయాన యత్నా లలో ఆటంకాలు తొలగిపోగలవు. పరోపకారానికి పోయి సమస్యలు తెచ్చు కోకండి. **కుంభం** :ఉద్యోగస్తులు అధికారులతో ఏకీభవించలేరు. ఏజెంట్లకు, బ్రోకర్లకు పురోభివృద్ధి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్ల విషయంలో ప్రతికూలతలు, చికాకులు ఎదురవుతాయి. **మీనం** : మిత్రుల నుండి ఒక ముఖ్య సమాచారం అందుకుంటారు. విద్యార్థినులు పట్టుదలతో శ్రమించిన సత్ఫలితాలు సాధించగలరు. క్రయవిక్రయాలు సామాన్యం. కొత్త కొత్త వ్యాపార రంగాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ముఖ్యుల గురించి ధనం వెచ్చిస్తారు.

## సాయిబాబా చిన్న కథలు



### భక్త వాత్సల్యం


బెంగాలు రాష్ట్రంలో మాధవదాసు అనే భక్తుడు ఉండేవాడు. అతని భార్య మరణించింది. మాధవదాసుకు జీవితం మీద విరక్తి కలిగింది. ఆస్తిపాస్తులను అమ్మి వ్యవహారములనన్నింటిని చక్కజేసి, కాషాయ వస్త్రములను ధరించి పూరి క్షేత్రమునకు చేరాడు. పూరి క్షేత్రముల జగన్నాథుని సేవిస్తూ, ఆహర్నిశలూ జగన్నాథ నామస్మరణం చేసేవాడు. పగలంతా దేవాలయాములో గడిపి, రాత్రికి సముద్రపు ఒడ్డుకు చేరి ఇసుక మీద హాయిగా నిద్రించేవాడు. నిరవధిక ఉపాసన వలన అతనిలో వింత తేజస్సు, ఒక శక్తి ఆవిర్భవించినవి. ఒకనాడు జగన్నాథుడు, సోదరి సుభద్రతో సముద్ర తీరానికి వచ్చి, అక్కడ ఒక బంగారు పళ్లెమును పెట్టి అదృశ్యమయినాడు. మాధవ దాసునకు ఈ విషయం తెలియదు. అతడు మైమరచి నామ స్మరణం చేస్తున్నాడు. కొంతసేపటికి కన్నులు తెరిచాడు. ఎదురుగా ఒక పళ్ళెములో రుచికరమైన ఆహార పదార్థములుండడం చూశాడు. అతడు ఏ విధమైన భావము లేకుండా ఆ ఆహారమును భుజించి, మరల ధ్యానములో నిమగ్నుడైనాడు. అతనికి నిర్విచార స్థితి కలిగింది. బంగారు పళ్ళెము మీద అతని దృష్టి పడలేదు. ఆహారము ఏ విధంగా వచ్చినదీ అని కూడా ఆలోచించలేదు. ఆలయంలో జగన్నాథ స్వామికి రాత్రి వేళ మహా భోగమును నివేదన చేయు బంగారు పళ్లెము పూజారులకు కనబడలేదు. ఆలయ అధికారులు బంగారు పళ్లెమును తస్కరించిన దొంగలను వెదుకుటకు బటులను పంపాడు. సముద్రం ఒడ్డున ధ్యానంలో మాధవదాసు ఉన్నాడు.

అతని ముందర బంగారు పళ్ళెము ఉన్నది. భటులు మాధవదాసును బంధించి చెరసాలలో ఉంచారు. ఆరోజు రాత్రి జగన్నాధుడు ఆలయ పూజారికి కలలో కనిపించి, మీరందరూ నాకు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆహారమును నివేదన చేస్తారు. కానీ నేను తిన్నానని నన్ను కొట్టి హింసిస్తారు అని పలికి అదృశ్య మయినాడు. పూజారి భయపడుతూ నిద్ర లేచాడు. అతనికి ఇది కలయా! నిజమా! అని తెలియక అచేతనంగా కూర్చున్నాడు. ఆరోజు జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని ఆలోచించ సాగాడు. మాధవదాసు మహా భక్తుడు.

అతనికి బంగారు పళ్లెములో ఆహారమును అందించినది జగన్నాథుడు. అనాధలకు నాధుడు జగన్నాథుడే కదా! అని నిర్ణయించి పూజారి, ఆలయ అధికారులకు తెలిపి మాధవదాసును చెరసాల నుండి విడిపించాడు. దీనికి మాధవదాసు పొంగిపోలేదు. దైవానుగ్రహము వలన మాధవదాసు కీర్తి ప్రతిష్ఠలు, భక్తిప్రపత్తులు దశదిశల వ్యాపించినవి.

... **సశేషం**

## సంకీర్తన



# కన్నూరులో తిరుగులేని వైసీపీ

## - తల్లి సర్పంచ్ తనయుడు ఎంపీటీసీ




పరవాడ : పరవాడ మండలము కన్నూరు పంచాయితీలో వైసిపి రెపరెపలు అడుతుంది అనడములో ఎటువంటి సందేహంలేదు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రత్యర్థిలుపై గొల్లవెల్లి కృష్ణవేణి పోటి చేసి అత్యధిక మెజార్టితో గెలిచి చరిత్ర సృష్టించారు. అలాగే ఇటీవలే జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో వైసిపి పార్టినుండి గొల్లవెల్లి శ్రీనువాస్ పోటీచేసి ప్రత్యర్థిలుపై గెలిచి కన్నూరుపంచాయితీలో వైసిపికి తీరుగులేదు అని నిరూపించారు.

గడిచిన రెండు ఎన్నికల్లో సర్పంచ్ గా గొల్లవెల్లి కృష్ణవేణి గెలిపొందిగా ఎంపిటిసిగా గొల్లవెల్లి శ్రీనువాస్ గెలిపొందారు. వీరూ ఇద్దరు తల్లి తనయులు కావడం గమనర్హం. రెండు పదవులు ఒకేకుటుంబంలో తల్లి,కొడుకుకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా గొల్లవెల్లి శ్రీనువాస్ మాట్లడుతూ నాపై నమ్మకంతో అత్యధిక మెజార్టితో గెలిపించిన కన్నూరూ పంచాయితీ ప్రజలుకు ప్రత్యేక మైన కృతజ్ఞతలు తెలియపరిచారు. సర్కార్ ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమం అభివృద్ధి,కార్యక్రమాలు స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్ రాజ్ మా(గ్రామం (కన్నూరు)పై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ నావిజయానికి సోపానాలుగా మారాయి అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని రాజకీయాలుకు అతీత ంగా లబ్ధిదారులు అందరికీ అందేలా కృషిచేస్తాను అని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ సౌరథ్యంలో పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మ శ్రీనువాస్ మరియు పరవాడ జడ్పిటిసి పి.యస్ రాజు సలహాలుతో కన్నూరు గ్రామ పంచాయితీని మరింతఅభివృద్ధిదిశగా మారుస్తాను అని తెలిపారు.

# జడ్పీటీసీ తుంపాల అప్పారావు కి అభినందనలు



సబ్బవరం : సబ్బవరం మండలంలో జెడ్పిటిసి గా మొన్న జరిగిన స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన తుంపాల అప్పారావు కి బుధవారం ఉదయం జిల్లా దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్, సంఘ సభ్యులు జడ్పిటిసి అప్పారావు ని ఘనంగా సన్మానించి విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పారావు కు ఎప్పుడు ఓటమిలేదు. ఎప్పుడు ఎన్నికల్లో నిలబడిన విజయమే తప్ప అపజయం లేదు. అంతేకాదు రెండు దపాలుగా ఎమ్ పి టి సి గా సర్పంచ్ గా ఎన్నో సేవలందించి ఈ ప్రాంత ప్రజల అభిమా నాన్ని సంపాదించుకున్నారు.అలాగే వైసీ పి మండల కన్వీనర్ గా పనిచేసి నాయకుల అందరి లో మంచి పేరు తెచ్చు కున్నారు. అందువల్లే అప్పారావు ఈ ఎన్నికల్లో ఇంత మెజారిటీ తో గెలిచారని తెలియజేసుకుంటున్నాను. అప్పారావు ముందు ముందు ఎన్నో మంచి మంచి పదవులు చేయాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్నాల ఈశ్వరరావు, వంకర అర్జున, యల్లపు అప్పారావు, యల్లపు యల్లాజీరావు, దేముడు బాబు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి

## రూ.1,00,000/- విరాళం



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కు చెందిన యస్.రామ శేషు సూర్య ప్రభావతి దంపతులు రూ.1,00, 000/- విరాళమును దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో జ్యేష్ఠ బహుళ తదియ నాడు సత్యవతి పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో త్రినాధరావు అభినందించారు.

# పరవాడ తహశీల్దార్ బి.వి.రాణికి చిరు సత్కారం



పరవాడ : ఇటీవలే పరవాడ మరిడిమాంబ అలయ ప్రాంగణంలో జరిగిన పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశానికీ కొన్ని అనివార్య కారణాలు వలన హజరు కాలేక పోయిన పరవాడ తహశీల్దార్ బి.వి.రాణిని బుధవారం పరవాడ న్యూప్రెస్ క్లబ్ సభ్యులు పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరము న్యూప్రెస్ క్లబ్ సభ్యులు చేతులుమీదగా తహశీల్ధార్ బివిరాణికి షీల్డ్ అందజేసి చిరు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో....

పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ అద్యక్షులు లాలం కృష్ణారావు, కార్యదర్శి పైల సన్యాశినాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా అద్యక్షులు రెడ్డి గోపి, కార్యదర్శి మొహన్ రావు, పైల అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టిన బూస

## గత ముప్పై ఏళ్ళ చరిత్రను తిరగరాసిన బూస మరియు గెడ్డం రెండుసెగ్మంట్ల్ లో వైసీపీ ఘనవిజయం చీపురుపల్లి గడ్డపై వైసీపీ జెండా



పరవాడ : పరవాడ మండలము వాడచీపురుపల్లి పంచాయితీలో గత ముప్పై ఏళ్ళనుండి ఒకటే జెండా(టిడిపి)ఎగిరేది. టిడిపికి కంచుకోటగా ఉన్న వాడచీపురుపల్లి పంచాయితీలో మొట్టమొదటి సారిగా వైసిపి జెండా రెపరెప లాడుతుంది అనడములో ఎటు వంటి సందేహం లేదు..గడిచిన ప్రాదేశిక ఎన్నికల్లో చీపురుపల్లి 2సెగ్మంట్ కు మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు సతీమణి మాసవరపు సునీత (టిడిపి)అభ్యర్థిపై ప్రత్యర్థి బూస అప్పలరాజు(వైసిపి)గెలిచి చరిత్రసృష్టించారు. ఇకపోతే సెగ్మంట్ 1లో కూడా టిడిపి అభ్యర్థిపై వైసిపి నుండి గెడ్డంపుష్ప గెలిచి వాడచీపురుపల్లి గెడ్డపై వైసిపి జెండా ఎగరువేసారు. గత 30సంవత్సరాలు నుండి వస్తున్న అనవాయితీని బూసఅప్పలరాజు మరియు గెడ్డం పుష్ప తిరగరాసారు. అనంతరము బూస అప్పలరాజు మాట్లడుతూ చీపురుపల్లి1మరియు చీపురుపల్లి2 సెగ్మంట్ల్ లో వైసిపి గెలవడం చాలా గర్వించదగ్గవల్సిన విషయమనీ అన్నారు. ప్రాదేశిక ఎన్నికలముందే ఏర్పాటుచేసిన విలేఖర్లు సమావేశంలో ఎన్నికల్లో నీను గెలిచి మరోవెన్నెలపాలాన్ని చూపిస్తాను అని అన్నాను అన్నారు..అన్నట్టుగానే రెండు సెగ్మంట్ల్ లో వైసిపి అభ్యర్థిలు గెలిపొందారు అన్నారు. నాఈ గెలుపుకు కారణమైన పంచాయితీ ప్రజలుకు నాయకులుకు కార్యకర్తలుకు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియపరిచారు.

# విశ్వబ్రాహ్మణ ఎన్నికల గురించి ఆత్మీయ సమావేశం



విశాఖపట్నం : సింహచలం కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షతన. అధ్యక్షుడు పావులూరి హనుమంత రావు దువూరి నరసింహ ఆచారి ముఖ్యఅతిలుగా విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ ఎన్నికల గురించి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 36 మండల నుంచి అధ్యక్షుడు, నాయకులు, సంఘీలు అందరూ సమావేశంలో పాల్గొన్నారు. స్థానికం ఉన్న పండురి సాంబమూర్తి కన్వీనర్ మల్లిఖార్జును విశాఖ జిల్లా ఎన్నిక చేయడం జరిగింది. విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోడి నరసింహఆచారి, జిల్లా సెక్రటరీ పక్కి కొండ బాబు, గాజువాక స్వర్ణకార సంఘం అధ్యక్షుడు డొంక నానాజి, విశ్వ బాహ్మణ సంఘం వాసు, కె.సిద్దయ్య, ఆచారి హరి, జి.ప్రసాద్, బాబి,మూర్తి,చంద్రరావు.

# పరవాడ నూతన సిఐ సూర్యనారాయణను

## కలిసిన న్యూప్రెస్ క్లబ్



పరవాడ : ఇటీవలే పరవాడ ఇంచార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన పి.సూర్య నారాయణను బుధవారము పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ సభ్యులు పుష్ప గుచ్చం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు.

అనంతరము దుశాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పరవాడ న్యూప్రెస్ క్లబ్ అధ్య క్షులు లాలం కృష్ణారావు, సెక్ర్యటరీ పైల సన్యాశి నాయుడు, ఎలక్ట్రానిక్ మిడియా అద్యక్షులు రెడ్డి గోపి, ఎలక్ట్రానిక్ మీడియా సెక్రటరీ మోహన్‌రావు, పైల అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నేటి మహిళల కోసం

## రిలయన్స్ జెవెల్స్ బెల్లా కలెక్షన్

విశాఖపట్నం : రిలయన్స్ జువెల్స్ తమ ప్రత్యేకమైన ఆభరణాల కలెక్షన్ లో'' బెల్లా ప్రతిరోజు ప్రత్యేకం సరికొత్త డిజైన్లను ఆవిష్కరించింది. మహిళలను ప్రతి రోజు ప్రత్యేకంగా తీర్చిదిద్దే ల డిజైన్ చేయబడింది. ఈ కలెక్షన్ డిన్నర్ డేట్స్ వంటి సందర్భాలకు చక్కగా సరిపోతాయి. నిత్యం కష్టపడి పని చేస్తూ జీవితంలో మామూలు సమయం కూడా ఆస్వాదించే ప్రతి మహిళ శక్తి, అందానికి ప్రతిరూపంగా నిలుస్తాయి ఈ కలెక్షన్స్. ఒక వరుస, అనేక వరుసల చైన్లు, ఎల్లో గోల్డ్, రోజ్ గోల్డ్ లలో పొదిగిన ఉంగరాలు కూడా ఉన్నాయి. 6750 రూపాయలు నుంచి ప్రారంభమయ్యే ఈ కలెక్షన్ ధర అందరికీ అందుబాటులో ఉన్నాయి. రిలయన్స్ జువెల్స్ పొంది రూపొందించిన రూపొందించిన బెల్లా ఫిలిమ్స్ మొత్తం కలెక్షన్, డిజైన్లను చూపుతుందనే రిలయన్స్ జ్యువెలర్స్ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు.

# దేవాలయ మార్గం లో తుప్పలు తొలగింపు



భీమునిపట్నం : తగరపువలస గ్రామ దేవత శ్రీ శ్రీ యల్లారమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే మార్గమధ్యంలో గేడ్డ పూర్తిగా మట్టితో ని చెత్త తోనే కూరుకుపోయింది దీనివల్ల వాటర్ బ్రిడ్జి మీద నుంచి వస్తుంది దీనివల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని గమనించిన ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు జీవీఎంసీ వారికి కి తెలియజేయడం జరిగింది వెంటనే స్పందించిన జీవీఎంసీ సిబ్బంది చెత్తనంతా తొలగించి శుభ్రం చేశారు వెంటనే స్పందించినందుకు జీవీఎంసీ సిబ్బందికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# విద్యార్థినులు ఆందోళన



భీమునిపట్నం : స్థానిక ఏపిఆర్‌జేసి స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ కె.రఘునాథ్ బొబ్బిలి బదిలీ అయినందున దీనిని నిలుపుదల చేయాలని కోరుతూ విద్యార్థినులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ మెంబర్లు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# 27న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి



కొయ్యూరు : ఈ నెల 27న జరుగు భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కొయ్యూరు మండల కేంద్రంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జరిగే బంద్‌ను ఉద్యోగ కార్మిక రైతులు అందరూ విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సరుమూర్తి సూరిబాబు, వై.అప్పలనాయుడు, కె.నాగేశ్వరావు, ఎస్.ప్రసాద్, అనిల్, తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వరుణ్ సంస్థల చైర్మన్ ప్రభు కిషోర్ పుట్టిన రోజు సందర్భంగా

### బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు, మిఠాయిలు వితరణ




విశాఖపట్నం : వరుణ్ సంస్థల చైర్మన్ ప్రభు కిషోర్ పుట్టిన రోజు సందర్భంగా.. విశాఖ, వన్టౌన్లో ఉన్న...

వివేకానంద అనాథ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

6 బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు, మిఠాయిలు వితరణగా అనాథ వృద్ధులకు సాయం అందించినందుకు.. చైర్మన్‌ప్రభు కిషోర్ కు సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అచ్చంనాయుడిని కలిసిన గండి బాబ్జీ



పరవాడ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కింజరాపు అచ్చంనాయుడును పెందుర్తి నియోజక వర్గం,మాజీ శాసనసభ్యులు గండి బాబ్జీ మంగళవారం మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.

ఈ భేటీలో ప్రధానంగా పెందుర్తి నియోజక వర్గంలో ఉన్న పలు ముఖ్య సమస్యల గురించి రాష్ట్ర అధ్యక్షులకు బాబ్జీ వివరించారు. 2024 లో జరగబోయే సాదారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవడానికి ఇప్పటినుంచే పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలని, ఈ సందర్భంగా గండి బాబ్జీకి సూచనలు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో పరవాడ, సబ్బవరం, .పెందుర్తి మండలలాలకు చెందిన ముఖ్య నాయకులు గండి రవికుమార్, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ,గండి వంశి,మాజీ సర్పంచ్ బుజ్జి, గొంప సత్యనారాయణ,వేణు తదితరులు ఉన్నారు.

### రోడ్ల నిర్మాణం కొరకు రెవెన్యూ భూముల పరిశీలన



గొలుగొండ : రాజమండ్రి నుంచి విజయనగరం వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కొరకు గొలుగొండ మండలం పాతూరు, కేడీపేట, నాగాపురం రెవెన్యూ పరిధిలో భూములను నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన రైతులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, నేషనల్ రోడ్డు అథారిటీ అధికారులు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# స్కీమ్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి



పాడేరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథ కాలలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు అంగన్వాడీ మధ్యాహ్న భోజన పథకం వెలుగు వివో ఎ నేషనల్ హెల్త్ మిషన్ సర్వ శిక్ష అభియాన్ వంటి రంగాల్లో సంవత్స రాల తరబడి కార్మికులు ఉద్యోగులు పనిచేస్తున్నారు.

వీరిని ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించడం లేదు వేతనం పేరుతో తక్కువ వేతనాలతో పని చేస్తున్నరూ స్కీం వర్కర్లు రిటైర్ అయినా ఎటువంటి పరిహారం లేకుండానే ఉద్యోగం నుండి వైదొలగుతున్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్ల పర్మినెంట్ చేయాలని...కనీస వేతన 21000 ఇవ్వాలని, రిటైర్ అయ్యే స్కీం వర్కర్లకు 5 లక్షల ఎక్స్గ్రేషియా, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోవిడ్ కాలంలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలకు 50 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ జరుగు సమ్మెలో స్కీము లో పని చేస్తున్న ఆశ అంగనవాడి సి హెచ్ డబ్ల్యు ఐకెపి వివో ఏఎన్‌హెచ్ఎం సర్వ శిక్ష అభియాన్ కార్మికులు ఉద్యోగులు జయప్రదం చేయాలని స్కీమ్ వర్కర్ల కమిటీ పిలుస్తున్నది ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు వై మంగమ్మ చిన్న చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రి నాదునికి వైభవంగా నిత్యకల్యాణం

## ఘనంగా గరుడ సేవ





సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం శ్రీ సింహాద్రి నాధుడు నిత్య కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు, ఉత్సవంలో భాగంగా సింహాద్రి నాథుడు శ్రీదేవి భూదేవి అమ్మవార్లు ను అత్యంత సర్వాంగ సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపించారు, తదుపరి స్వామివారి ఆర్జిత సేవలలో అత్యంత కీలకమైన గరుడ సేవను ఘనంగా జరిపించారు.

వేద మంత్రోచ్ఛారణల నడుమ మృదుమధుర మంగళ వాయిద్యాల నడుమ సాగిన సేవల్లో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు.

# పైనంపాడు సెక్టార్ పరిధిలో

## ఘనంగా పౌష్టికాహార మహోత్సవ సభ :- ఐసిడిఎస్ పిఓ ఆనంద్



అనంతగిరి : మండలంలో పైనంపాడు సెక్టర్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐ.సి డి.ఎస్.పిఓ ఆనంద్, సూపర్వైజర్ ఆధ్వర్యంలో ఘనంగా పౌష్టికాహార మహోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం భుజించడం వల్ల అనేక రకాల వ్యాధుల నుండి కాపాడుకోవచ్చని నిత్యం కాయగూరలు, ఆకుకూరలు, ఉడికించిన గుడ్డు,పాలు రాగి జావా, వంటివి ఆహారంగా తీసుకోవాలని తెలిపారు గిరిజన పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతారని ఉద్దేశంతో ప్రస్తుత వై ఎస్ ఆర్ సి పి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం వెనుకాడడం లేదని తెలిపారు. అలాగే గ్రామంలో సెక్టర్ పరిధి అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్,ఆధ్వర్యంలో కొంతమంది గర్భిణులకు శ్రీమంతం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధి అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది, స్థానిక పంచాయతీ సర్పంచ్ గ్రామస్తులు పలువురు హాజరయ్యారు.



# బాలల హక్కుల పరిరక్షణకు పిఎంసిలు కృషి చేయాలి

## సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం



విశాఖపట్నం : రాష్ట్రంలో బుధవారం జరిగిన తల్లి దండ్రుల పర్యవేక్షణ సంఘాల (పేరెంట్స్ మోనటరింగ్ కమిటీ) ప్రతినిధులుగా నూతనంగా ఎన్నికైన ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరి రక్షణకు, సంక్షేమానికి కృషిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్)రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. విశాఖ నగరంలోని ఎంవీపి కోలనీ ప్రభుత్వ మత్స్యకార ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం జరిగిన పిఎంసి ఎన్నికల్లో సీఆర్పీఎఫ్ విశాఖ నగర కమిటీ సభ్యులతో కలిసి సీతారాం పాల్గొన్నారు. ప్రతీ తరగతి గదిలోని విద్యార్థులు వారి తల్లిదండ్రులుతో ఈ ఎన్నిక ఆవశ్యకత,ఎన్నిక వల్ల ఉపయోగాలు,బాలల హక్కులతో ముడిపడిఉన్న అంశాలు,ఒక్కో తరగతి నుండి ఓపెన్,బిసి,ఎస్సీ సామాజిక వర్గాలనుండి ముగ్గురు సభ్యుల్లో ఖచ్చితంగా ఇద్దరు మహిళలు ఉన్నారా, అధ్యక్షులు, ఉపాధ్యక్షునిగా ఒక మహిళను ఎన్నుకుంటున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు,పదవీ బాధ్యతలు స్వీకరణ తరువాత విద్యార్థుల మనసులు గెలుచుకునే హక్కుల సాధన,అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అనంతరం ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, నగర మహిళా కన్వీనర్ ఎం.చిన్నతల్లి నూతనంగా ఎన్నికైన తల్లిదండ్రుల పర్యవేక్షణ సంఘం సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలల్లోని సమాజంలోనూ బాలల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎంత ప్రాధాన్యత కల్పించాలని కొరుకొంటామో అదే నిష్పత్తిలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించేలా విద్యార్థుల తల్లిదండ్రులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను ఫోరం తరపున కండువాలు కప్పి సీఆర్పీఎఫ్ తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోధ్యాయురాలు కె.వి.సత్యవాణి, పేర్ల భాస్కర్ రావు వార్డ్ సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీ కే జే అమృత, ఫోరం రాష్ట్ర కో కన్వీనర్లు డాక్టర్ ఎం.కల్యాణి,పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికే..

# తల్లితండ్రుల విద్యా కమిటీ..



విశాఖపట్నం : విద్యార్థుల... సర్వతోముఖాభివృద్ధికే.. తల్లితండ్రులతో.. విద్యాకమిటీ..అని.. రాజగిరి అప్పలస్వామి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆశాదేవి స్పష్టం చేశారు. పాఠశాలలో.. విద్యా కమిటీ నియామకం ఈరోజు జరిగింది. చైర్మన్ గా సంతోషి, వైస్ చైర్మన్ గా మమతను ఎన్నుకున్నారు. మొత్తం 22 మంది ఈ కమిటీలో ఉన్నారు. పాఠశాలలో..పరిశుభ్రత, పలు సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ కృషి చేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు ఎన్. వరలక్ష్మి, షేక్ గౌసియా బేగం, కె.మాధురి, ఆర్. లలిత, బి వెంకట లక్ష్మి అంగన్వాడి కార్యదర్శి తేజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుమూల గిరిజన గ్రామాల బాట పట్టిన జడ్పీటీసీ గంగరాజు

## గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు చెబుతూ...సమస్య తెలుసుకుంటూ రోజంతా ప్రయాణం





అనంతగిరి : అనంతగిరి మండలంలో జడ్పిటిసి దీసరి గంగరాజు ఆయా గ్రామాలలో పెద్దకోట పంచాయతీ,(జర్రకొండ హుకుంపేట మండలం సరిహద్దు గ్రామాల్లో పర్యటించి) బందకొండ, పాటిపల్లి,చిడివలస.గ్రామాల్లో పర్యటించి జడ్పిటిసి గా నను గెలిపించి నందుకు మీ అందరికి కృతజ్ఞతలు, తెలుపుతున్నాను. ఈ ప్రాంతంలో సమస్యలపై, పరిష్కారం కోసం కృషి చేస్తానని, మంచినీటి సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉన్నది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం చేస్తానని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో. మోస్య. సోమేల. నాగులు, సొంటారి. సుబ్బరావు, పాంగి. రాము,చిట్టం. భీమరాజు, బుధ్ధురాజు,సింహాద్రి పర్యటనలో ఉన్నారు గ్రామాల్లో పాల్గొన్న నాయకులు కాదేల. నూష్,నాగేష్, కిల్లో.సన్యాసిరావు,నాగేశ్వరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పైడివాడ అగ్రహారంలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు



సబ్బవరం: పైడివాడ అగ్రహారం ఎంపీపీ స్కూల్లో బుధవారం పేరెంట్స్ కమిటీ ఎలక్షన్ ప్రధాన ఉపాధ్యాయులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ ఎలక్షన్ లో స్టూడెంట్స్ తల్లిదండ్రులందరూ కలిసి ఏకగ్రీవంగా చైర్మన్ పెచ్చెట్టి మహాలక్ష్మి నాయుడు ను వైస్ చైర్మన్ పెచ్చెట్టి శివ కుమారి ఎన్నుకోవడం జరిగింది.

ఎలక్షన్ అనంతరం పలు విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం కు సబ్బవరం ఎంపీడీవో రమేష్ నాయుడు గారు, గ్రామ సర్పంచ్ వడ్డాది అప్పల రాజు గారు, ఎంపీటీసీ సీరం అప్పల రాజు, ఉప సర్పంచ్ రాపర్తి అరుణ, ముత్యాల నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గి నాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, గ్రామ పెద్దలు అక్కిరెడ్డి అచ్చిబాబు, కోన సత్యనారాయణ గారు, అక్కిరెడ్డి నూకరాజు గారు, ప్రధాన ఉపాధ్యాయులు రామారావు, రమేష్, పంచాయితీ సెక్రెటరీ మేడం, తల్లిదండ్రులు మరియు గ్రామ యువకులు హాజరైనారు.

# గిరిజన సాంప్రదాయ వేషధారణలో ఎంపీ మాధవి





కొయ్యూరు : ఇటీవలే అరకు విచ్చేసిన అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, సహచర కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత విశ్వనాథ్, కేరళ అల్తుర్ పార్లమెంట్ సభ్యులు రమ్య హరిదాస్‌తో కలిసి అరకు వ్యాలీ మండలంలోని పెదలబుడు గ్రామంలోని గిరి గ్రామదర్శన్ సందర్శించారు. కనుమరుగవుతున్న గిరిజన సాంప్రదాయాలను నేటి తరానికి కళ్లకు కట్టే విధంగా చూపించడమే ఈ గిరి గ్రామ దర్శన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అరకు ఎంపీ తెలిపారు. సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి గిరిజన సాంప్రదాయ వేషధారణ అరకు ఎంపి వివరించారు. అక్కడ ఏర్పాటు చేసిన గిరిజన సాంస్కృ తిక కార్యక్రమాల్లో పాల్గన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కనుమరుగవుతున్న గిరిజన సంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా అచ్చమైన గిరిజన సంప్రదాయాలను తిలకించాలనే పర్యాటకులకు అరకు మండలం పెదలబుడు గ్రామంలోని గిరి గ్రామదర్శన్ సందర్శించాలని కోరారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్

శ్రీకాకుళం : రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలపై దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లుతో గృహ నిర్మాణం పురోగతి, ఇళ్ల స్థలాలు, సచివాలయాల నిర్మాణం, వైయస్సార్ హెల్త్ క్లినిక్స్, వ్యవసాయం, తదితర వాటిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్ల స్థల పట్టాలకు వచ్చే దరఖాస్తులను 90 రోజులలో పరిష్కరించాలన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. లే ఔట్ ల వారీగా లబ్ధిదారులు ఎంత మంది ఉన్నది సమాచారం తెలియజేయాలన్నారు. ప్రభుత్వ లే అవుట్ ల్లో ఖాళీ గా ఉన్న ఫ్లాట్లను గుర్తించాలని ఆదేశించారు. బేస్ మెంట్ లోపల ఉన్న గృహ నిర్మాణాలు పై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని ఆదేశించారు. లే ఔట్ ల్లో నిర్మాణాలకు నీటి సౌకర్యం ఉండాలని, బోరు వేసేందుకు విద్యుత్ ఏర్పాటు చేయాలని, దీనిపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించి విద్యుత్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు జారీ చేయాలన్నారు.




గృహ నిర్మాణానికి ఇసుక రీచ్ నుండి తీసుకొనేందుకు లబ్ధిదారులు రవాణా చార్జీలు మాత్రమే చెల్లించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, జెసిలు వారానికి ఒకసారి గృహ నిర్మాణాలపై లే ఔట్ స్థాయి, వార్డు, మండల స్థాయి నుండి సమీక్ష జరగాలన్నారు. టిడ్కో గృహాలు పైన ఆయన సమీక్షించారు. గృహ హక్కు పథకం కింద 1980 నుంచి 2011 వరకు మంజూరైన గృహాలకు రిజిస్ట్రేషన్ చేస్తే బ్యాంకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించి డేటా సేకరణ సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు. ఎంఐజి గృహాలకు భూసేకరణ చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అగ్రిగోల్డ్ భూములను గుర్తించి ఎంఐజి గృహ నిర్మాణాలకు వినియోగించాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని చెప్పారు. డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలన్నారు. పంచాయతీలలో 3 నుంచి 5 సెంట్ల భూమి బల్క్ మిల్క్ యూనిట్లకు సరిపోతుందని చెప్పారు. నిర్మాణాలు డిశంబరు 31 నాటికి పూర్తి చేయాలన్నారు. అర్బన్ క్లినిక్స్ కు కావలసిన భూమిని గుర్తించి నిర్మాణాలు ప్రారంభించి డిశంబరు 31 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. మున్సిపల్ కమీషనర్లు ఈ విషయం పై దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రభుత్వ పథకాలు ప్రారంభానికి ముందు పథకానికి సంబంధించి రెండు సార్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హత గల వారికి ప్రభుత్వ పథకాలు అందాలని, అనర్హత గల వారికి పథకాలు అందకూడదని పేర్కొన్నారు. సచివాలయల్లో రిజిస్ట్రార్లు మెంటైన్ చేయాలని, అధికారులు సందర్శించేటప్పుడు పరిశీలించాలన్నారు. స్పందన, బయోమెట్రిక్ రిజిస్ట్రార్లు ఉండాలని వివరించారు. కోవిడ్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని, మాస్క్ లేకుండా షాపులకు వెళితే పెనాల్టీ వేయాలన్నారు. 3వ దశ కోవిడ్ వస్తుందో రాదో కాని అంతా సిద్ధంగా ఉండాలని, అవసరమైన సిబ్బంది నియామకానికి



చర్యలు తీసుకోవాలని, జాయింట్ కలెక్టర్ హౌసింగ్ టీజింగ్ హాస్పిటల్ పర్యవేక్షణ చేయాలన్నారు. వంద పడకలు దాటిన ప్రైవేట్ ఆసుపత్రులు కోవిడ్ వైద్యానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఆక్సిజన్, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వ్యాక్సినేషన్ వేసుకోకపోతే రెండు డోసులు తప్పకుండా వేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వాటిపై జాగ్రత్తగా ఉండాలని, వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని తెలిపారు. దిశ ఏప్ ను 70 లక్షల 570 మంది మహిళలు డౌన్ లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో 900 మంది సక్సెస్ స్టోరీలు ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోలీసు శాఖను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అభినందించారు. ఇ-క్రాప్ తప్పని సరిగా ఉండాలని చెప్పారు. అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ సమావేశాలను రైతు భరోసా కేంద్రాలు, మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా జాయింట్ కలెక్టర్లు సుమిత్ కుమార్, డాక్టర్ కె. శ్రీనివాసులు, హిమాంశు కౌశిక్ పాల్గొన్నారు. జిల్లా అధికారులు జడ్పి సిఇఓ లక్ష్మీపతి, డిపిఓ రవి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రనాయక్, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, సిపిఓ మోహన్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుమారుడికి ఆర్థిక సాయం

కొయ్యూరు : ఇటీవల చోడవరం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శివరామరాజు కుమారుడు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖలోని కేజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. తీవ్ర గాయాలు కావడంతో రెండు కాళ్లతో పాటు ఒక చేతిని తొలగించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న బాలుడి గురించి తెలుసుకున్న కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర, తన సహచరర అధికారులతో కలిసి ఆర్థిక సాయం అందజేశారు.

## మాకవరపాలెం ఎంపిపిగా రుత్తల సర్వేశ్వరరావు

మాకవరపాలెం : మండల కేంద్రం నుంచి ఎంపిటిసిగా గెలుపొందిన రుత్తల సర్వేశ్వరరావుకు ఎంపిపి పదవి దాదాపు ఖాయమైందని వైసిపి వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. మండలంలో మొత్తం 16 ఎంపిటిసి స్థానాలు ఉండగా వైసిపి 9, టీడీపీ 7 స్థానాల్లో గెలుపొందాయి. ఎంపిపి పదవి వైసిపి ఖాతాలో పడనుంది కానీ ఈ పదవిని ఆశించిన ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, మండల వైసిపి అధ్యక్షులు రుత్తల సత్యనారాయణ బూరుగుపాలెం ఎంపిటిసిగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో మాకవరపాలెం ఎంపిటిసి నుంచి గెలిచిన రుత్తల సర్వేశ్వరరావు పేరు తెరపైకి వచ్చింది. ఈయన గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. వైసిపి ఆవిర్భావం తర్వాత చైర్మన్ పదవికి రాజీనామా చేసి ఆ పార్టీలో చేరారు. అప్పటి నుంచి వైసిపిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎంపిపిగా సర్వేశ్వరరావుకే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైసిపి వర్గీయులు అంటున్నారు.

## వివాహబంధాన్ని మరింత పటిష్టం చేసుకోవాలి

కాకినాడ రూరల్ : పెళ్లినాటి ప్రమాణాలు మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ భార్య భర్తల బంధాన్ని మరింత పటిష్టం చేసుకోవాలి కానీ చిన్న చిన్న తగాదాలతో కాపురాన్ని నాశనం చేసుకోరాదని న్యాయవాది వసంత పేర్కొన్నారు.సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సు ఉద్దేశించి ఆమె మాట్లాడారు. భార్య భర్తల మధ్య నమ్మకం ఎంత బలంగా ఉంటే కాపురం అంత సంతోషంగా ఉంటుంది అన్నారు.భార్య భర్తల మధ్య పట్టువిడుపులు, రాజీలు,చిన్న చిన్న త్యాగాలు ఉండాలి గాని వివాదాలు ఉండరాదని వసంత తెలిపారు. ఈకార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్,రాఘవ రావు,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కోరాం లేక గుమ్మకోట గిరిజన బాలుర గురుకుల పాఠశాల చైర్మన్ -వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా



అనంతగిరి- మండలం లో గుమ్మకోట గిరిజన బాలుర గురుకుల పాఠశాల లో 22-09-2021న తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక కోసం గుమ్మకోట గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఎన్నిక కోసం వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొత్తం పాఠశాలలో 430 మంది విద్యార్థులు చదువుతున్నారని ఎన్నికల తల్లిదండ్రులకు తెలిచేయడం జరిగినది తల్లిదండ్రుల కమిటీ సభ్యులు 1:00 వరకు జరుగుతుందని తల్లిదండ్రుల జాబితా ప్రకటన చేస్తామని ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను నెంబర్స్ గా ఎన్నుకొని ఐదవ తరగతి నుండి పదో తరగతి వరకు ముగ్గురు చొప్పున 18 మందితో చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎక్స్ అపి సియా సభ్యులు మరియు ప్రధానోపాధ్యాయుడు లేక ఇన్చార్జి పాత్ర వహిస్తారని వైస్ ప్రిన్సిపల్ తెలియజేశారు ఎన్నికలు నిర్వహించే సమయంలో కనీసం 50 శాతం తల్లిదండ్రులు కొరమ్ లేకపోతే వాయిదా వేసి మరల ఎన్నికలు జరుపుటకు అవకాశం ఉందని తెలియజేశారు అమలుపరుస్తున్న సంస్థ రాష్ట్ర పథక నిర్దేశకుడు ఎస్ పి డి సర్వ శిక్ష అభియాన్ మరియు కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అని తెలియజేశారు పంచాయతీ సర్పంచ్ అప్పారావు నీ పంచాయతీ సెక్రటరీ ని పిలవడం జరిగింది అని తెలిపారు, ఎన్నికలకు పూర్తిస్థాయిలో తల్లిదండ్రులు రానందున 50 శాతం హాజరు కానందున చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేస్తున్నామని పై అధికారులకు మేము 50 శాతం తల్లిదండ్రులు రాలేదని తెలపడం జరిగిందని వారి యొక్క ఆదేశాల మేరకు వైదా వేయడం జరిగిందని వైస్ ప్రిన్సిపల్ బుచ్చిబాబు తెలిపారు దానితో పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహంతో మేము ఎంతో దూరం నుండి వస్తే ఎన్నిక లేదు అంటే ఎలా నీ గొడవ చేయడం జరిగింది దానితో వైస్ ప్రిన్సిపల్ పిల్లల తల్లిదండ్రులకు మేము మరల క్లాస్ టీచర్స్ తో కబురు పంపిస్తామని తెలియచేయడం జరిగినది కమిటీ లో పాల్గొనుటకువచ్చిన తల్లిదండ్రులు ఈ యొక్క పాఠశాల లో చదువుతున్న మా పిల్లలు అప్పుడప్పుడు మేము వచ్చి చూసేటప్పుడు తినే అన్నం ఉడికి ఉడకడం అన్నాన్ని పెడుతున్నారని వేడి నీరు అందించాలని టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తల్లిదండ్రుల కమిటీ మీటింగ్ పెట్టడం లేదని గతంలో ఉండే చైర్మన్ వైస్ చైర్మన్ కమిటీ సభ్యులు మీటింగులు పెట్టలేదని ఈ ఒక్క పాఠశాలకు నాడు నేడు కార్యక్రమం లో ఎంత వచ్చిందినే విషయం తెలియదని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయవలసిన బాధ్యత లేదా అని తల్లిదండ్రులు తెలిపారు ఈ కార్యక్రమంలో గుమ్మకోట గిరిజన గురుకుల పాఠశాల లో చదువు తున్న పిల్లలు తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా స్కూల్ కమిటి ఎన్నికలు



పరవాడ : పరవాడలో జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నతపాఠశాలలో బుధవారం తల్లిదండ్రులకమిటి ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికల్లో స్కూల్ కమిటి చైర్మన్ గా బత్తి వెంకటలక్ష్మి మరియు వైస్ చైర్మన్ గా కొరుబల్లి రమణారావును ఎన్నుకున్నట్లుగా పాఠశాల ప్రదానోపాద్యాయురాలు పి.సురేఖ తెలిపారు. అలాగే పరవాడ బిసి కోలనీలో గల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు కమిటి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ఈ ఎన్నికల్లో స్కూల్ కమిటి చైర్మన్ గా గుంట్లలక్ష్మి, వైస్ చైర్మన్ గా దేవిబత్తులరేనాను ఏన్నికున్నట్లుగా స్కూల్ ప్రిన్సిపాల్ యు.మనోరంజిని తెలిపారు. ఈ బోనంగి పంచాయితీ బొద్దపువానిపాలెం పాఠశాల తల్లి దండ్రులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు,పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, కార్యదర్శి అచ్యుతరావు,పైల టివి అప్పారావు, పోతలఅప్పలనాయుడు, పైల హరేష్ , బొద్దపు చిన్నారావు,బుగిడి గోవిందరావు, సిరపురపు రాజేష్ ,పైల అప్పి మరియు తల్లి దండ్రులు తథితర్లు పాల్గొన్నారు.

## మీ లివర్ డేంజర్ జోన్ లో ఉన్నది.. తెలిపే కొన్ని లక్షణాలు...



మన శరీరంలో అత్యంత పెద్ద అవయవం కాలేయం(లివర్). మన శరీరం ఆరోగ్యంగా ఉంచడానికి అనేకవిధాలుగా ముఖ్య విధులను నిర్వర్థిస్తుంది. మన శరీరంలో అతిపెద్ద అవయవం లివరే..!లివర్(కాలేయం) పెద్ద అవయవమే కాదు అతి ప్రత్యే కమైన అవయవం కూడా! శరీరంలో ఐదుకి పైగా పనుల్ని నిర్వర్తిస్తోంది. వెయ్యికి పైగా ఎంజైమ్స్‌ని లివర్ తయారు చేస్తుంటుంది. శరీరంలో ఎక్కడైనా గాయం అయినప్పుడు రక్తం కొద్దిసేపు కారి, అక్కడ గడ్డకట్టి, రక్తం కారిపోతోందంటే అందుకు అవసరమైన ఎంజైమ్స్‌ని లివరే ఉత్పత్తిచేస్తుంది. అనారోగ్యాలు కలిగినప్పుడు, వాటినుంచి తట్టుకోవడానికి అవసర మైన యాంటిబాడీస్‌ని కాలేయమే(లివర్) ఉత్పత్తి చేస్తుంది. మద్యపానం ఒక్కటే లివర్ డ్యామేజ్ కు కారణం కాదు. మేము మద్యం త్రాగము కాబట్టి మాకు లివర్ డ్యామేజ్ సమస్యలు ఏం ఉండవనుకోవడం చాలా పొరపాటు. కొన్ని సార్లు మీరు తీసుకొనే ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల కాలేయం చుట్టూ అధికంగా క్రొవ్వు చేరుతుంది. దీన్ని ఫ్యాటీ లివర్ సింధ్రోమ్ అంటారు. అంతే కాదు దీన్ని లివర్ డ్యామేజ్ గా కూడా వర్గీకరిస్తారు. అంతే కాదు కాలేయ వ్యాధులు వివిధ రకాలుగా ఉన్నాయి.

లివర్(కాలేయ)వ్యాధులను ఉత్తమ చికిత్సనందిం చే 14 హోం రెమెడీస్ చిన్న వయస్సులోనే లివర్ డ్యామేజ్ అయితే అది ప్రాణానికే ప్రమాధంగా గుర్తించాలి . అందుకు లివర్ డ్యామేజ్ లక్షణాలను వెంటవెంటనే గుర్తించాలి. ఎందుకంటే ఎటువంటి సంకేతాలు లేకుండా లివర్ డ్యామేజ్ అవుతుంటాయి. సడన్ గా బయటపడుతుంటాయి. కాబట్టి, మనకు తెలియకుండా లివర్ డ్యామేజ్ కు కారణం అయ్యే కొన్ని లక్షణాలు ఈ క్రింది విధంగా గుర్తించండి... ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

**లివర్ ఫైబ్రోసిస్:** లివర్ డ్యామేజ్ అవ్వడం వల్ల కణజాలాల్లో ఫైబ్రయోస్ స్కార్స్ వల్ల కాళ్లల్లో కొద్దిగా వాపులు కనబడుతాయి.

**కామెర్లు:** చర్మంలో పసుపుపచ్చవర్ణంలో మరియు కళ్ళు లేత పసుపు రంగులోకి మారినట్లైతే అది జాండీస్ (కామెర్ల)కు చిహ్నంగా గుర్గించాలి. పాలిపోయిన చర్మం, కళ్ళు పచ్చరంగులో మారడం దెబ్బతిన్న కాలేయానికి లక్షణాలు. పచ్చని చర్మం, తెల్లని కళ్ళు బిలిరుబిన్ (బిల్ పిగ్మేంట్) వలె రక్తంలో పెరుగు తుంది, ఇది శరీరం నుండి మలినాలను తొలగించ లేదు.

**లివర్ సిస్ట్:** కాలేయంలో సిస్టులు (గడ్డలు)వంటివి ఏర్పడినప్పుడు నొప్పి మెలిపెడుతుంటుంది. పరిస్థితి తీవ్రమైనప్పుడు లక్షణాలు బయటపడుతాయి. పొత్తికడుపు, ప్రత్యేకంగా పొత్తికడుపు పైన కుడివైపు మూలన లేదా పక్కటేముకకు కింద కుడి భాగంలో నొప్పి ఉంటే అది కాలేయం దెబ్బతిన్న లక్షణాన్ని సూచిస్తుంది.

**హెపటైటిస్:** లివర్ సమస్యలు తీవ్రమైనప్పుడు, అలాంటి పరిస్థితిని హెపటైటిస్ గా పిలుస్తారు . ఇలాంటి స్థితిలో వాంతులు, అలసట, జ్వరం, కళ్ళు తిరగడం, మరియు జలుబు వంటి లక్షణాలుతో రోగి బాధపడుతారు.

**ఆల్కహాల్ తీసుకోవడం:** జీవక్రియలు సరిగా పనిచేయనప్పుడు ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల, కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది.

మగతగా ఉండటం మరియు గందరగోళం వంటి లక్షణాలు కాలేయ సమస్యలను సూచిస్తుంది.

**వికారం:** కాలేయం సరిగా పనిచేయనప్పుడు, వికారంగా అగుపించవచ్చు. తిన్నది సరిగా జీర్ణం అవ్వని పరిస్థితిలో వెంటనే డాక్టర్ ను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి.

**మూత్రం ముదురు రంగులో ఉండటం:** కాలేయ వ్యాధులకు మరో సూచన డార్క్ ఎల్లో యూరిన్ . ఇలాంటి పరిస్థితిలో మెడికల్ చెకప్ తప్పనిసరి.

**అలసట**: దీర్ఘకాలం పాటు, తరచూ అలసటకు గురి అవుతున్నట్లైతే అది కాలేయ వ్యాధిలకు సూచన. ఇలాంటి వాటికి కేవలం వైద్యపరమైన టెస్ట్ లు మాత్రమే నిర్ధారించగలవు.

పొడి కళ్ళు మరొక కంటి ఆందోళనగా పొడి కళ్ళు అని చెప్పవచ్చు. కంటి లూబ్రికేట్ గా కంటిని ఉంచేందుకు తగినంత కన్నీళ్లు నిర్వహించడం లేదని అర్థం. కన్ను మంట మరియు చాలా అసౌకర్యంగా ఉంటుంది.

పొడి కళ్ళు అనేవి ఎక్కువగా కంప్యూటర్ వాడకం లేదా చాలా ఎక్కువగా బయట గాలి నుండి సంభవించవచ్చు.

ఈ పరిస్థితి సుదీర్ఘ కాలం ఉంటే, సంప్రదించాలి. పొడి కళ్ళ చికిత్సకు సాదారణంగా బయట తీసుకున్న కంటి డ్రాప్స్ వేసుకుంటే సరిపోతుంది. కానీ ఈ సమస్య దీర్ఘకాలికంగా ఉంటే, చికిత్స ప్రణాళికలో పారుదల రంధ్రాలను పూరించే శస్త్రచికిత్స చేయాలి. కనురెప్పల కూడలిలో కన్నీళ్లు నిర్వహించ డానికి ఈ చికిత్స అవసరం అవుతుంది.

# టుబాకోపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్



విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్-302 వారి ఆధ్వర్యంలో నిర్వహించిన టుబాకో వలన కలిగే అనర్ధాలపై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. బుధవారం ఆమె మూడవ జోన్ 20వ వార్డు పరిధిలో ఈస్ట్ పాయింట్ కాలనీ కె.డి.పి.ఎం. స్కూలులో ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్-302 వారి ఆధ్వర్యంలోల టుబాకోపై అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ధూమపానం, మద్య పానం వలన ఊపిరితిత్తులకు సంబందించినల వ్యాధులు, పక్షవాతం, గుండె జబ్బులు, క్యాన్సర్, హార్మోన్ల మార్పులు వంటివి వస్తాయని, అందువలన దూమపాననానికి, మధ్యపానానికి యువత దూరంగా ఉండాలని, చెడు అలవాట్లు వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వారి ఆర్థిక పరిస్థితి చాల దీనస్థితిలో తయారవుతుందని, తద్వారా వారి మానసిక పరిస్థితులలో మార్పులు ఏర్పడి కుటుంబాలు నాశనం అవుతున్నాయని తెలిపారు. అందుకు ఇప్పటి నుండే విద్యార్ధులలో అవగాహన కల్పించాలని, పాఠశాలలో విద్యార్ధులు రూపొందించిన దూమపానంపై ప్రసంగం వక్తలని ఆకట్టుకుందని తెలిపారు. దూమపానంపై ఇటువంటి కార్యక్రమాలు ప్రతీ పాఠశాలలోనూ, వార్డులలోనూ లఘునాటక రూపంలో ప్రదర్శించాలని, విద్యార్ధులకు వ్యాసం రాయడం ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్-302 చైర్మన్ యశోద పాటిబండ, వార్డు కార్పొరేటర్ నక్కెల్ల లక్ష్మి, విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఎం. తిరుమల శ్రీదేవి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేరు ప్రెసిడెంట్ వై. రాము, ప్రతినిధులు శైలజ, కార్యదర్శి స్వాతి, వల్లి రాంగోపాల్, శశికళ, ద్రోణంరాజు శ్రీవత్స తదితరులు పాల్గొన్నారు.

## 'కుంబ్లేను కోచ్‌గా నియమించాలంటే బీసీసీఐ ఆలోచించాలి'



ఢిల్లీ : పంజాబ్ కింగ్స్ హెడ్‌కోచ్ అనిల్ కుంబ్లేపై ఆ జట్టు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ రెండు పరుగుల స్వల్ప తేడాతో ఓటమిపాలైన సంగతి తెలి సిందే. ఈ మ్యాచ్‌లో జట్టు ఎంపిక సరిగ్గా లేదని, ఓటమికి కుంబ్లే కుంటి సాకులు చెబుతున్నారని అభిమానులు మండిపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో దిగ్గజ స్పిన్నర్‌ను ట్రోల్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు త్వరలోనే కుంబ్లే టీమ్ఇండియా కొత్త కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలున్నాయనే వార్తల నేపథ్యంలో బీసీసీఐ ఆ నిర్ణయం తీసుకునేముందు పునరాలోచించాలని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.



జాతీయ ఎస్సీ కమీషన్ ఛైర్మన్ అరుణ్ హల్దర్ కు ఆదిశంకరాచార్యుల వారి ప్రతిమను బహూకరిస్తున్న విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి

# దేశ రక్షణ కోసం రాజశ్యామల అనుగ్రహం పొందండి

## - డీఆర్ డీఓ చైర్మన్ తో స్వాత్మానందేంద్ర స్వామి



న్యూ ఢిల్లీ : దేశ రక్షణ కోసం జగన్మాత రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం పొందాలని రక్షణ శాఖ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ(డీఆర్ డీఓ) ఛైర్మన్ సతీష్ రెడ్డికి విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి సూచించారు. పూర్వకాలంలో రాజులు యుద్ధానికి వెళ్ళే ముందు రాజశ్యామల అమ్మవారికి పూజలు చేసి సత్ఫలితాలను సాధించేవారని తెలిపారు. లోకాలను పాలించే రాజమాతంగిగా అమ్మవారు పూజలందుకుంటున్నారని వివరించారు. ఈరోజు ఢిల్లీలో స్వాత్మానందేంద్ర స్వామి డీఆర్ డీఓ ఛైర్మన్ సతీష్ రెడ్డి నివాసానికి వెళ్ళి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశంతో పాటు దేశ ప్రజల రక్షణకు సైతం డీఆర్ డీఓ కట్టుబడి ఉందన్నారు. కరోనా ఆపత్కాలంలో ఇమ్యూనిటీ పెంచే 2 - డీ పొడరును తయారు చేసామని, దేశవ్యాప్తంగా వేయి(1000) ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే పదివేల ఆక్సిజన్ పడకలను ఏర్పాటు చేసి సేవలందించామని స్వామీజీకి వివరించారు. తన హయాంలో రాడార్, క్షిపణి వ్యవస్థలను అత్యాధునికంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. రాజశ్యామల అనుగ్రహంతో మరింత పటిష్టంగా రక్షణ శాఖను తీర్చిదిద్దాలని ఛైర్మన్ సతీష్ రెడ్డికి స్వాత్మానందేంద్ర స్వామి ఆశీస్సులు అందించారు.

## విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో

# గ్రీవెన్స్ నిర్వహించిన కెకె రాజు



సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గల ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి పలువురు కార్యాలయంకు విచ్చేసి తమ సమస్యలను కె కె రాజు కి స్వయంగా విన్నవించారు.వారి వద్ద నుండి సంబంధిత వినతి పత్రాలు, దరఖాస్తులు తీసుకుని అధికారులతో మాట్లాడి కొన్ని వెంటనే పరిష్కరించారు.మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రీవెన్స్ లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,14 వార్డు కార్పొరేటర్ కతారి అనిల్ కుమార్ రాజు, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాలు ముందు ఉన్న వ్యర్ధాలను దుకాణదారులే తీయించాలి

## - జీవీఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన



విశాఖపట్నం : వాణిజ్య సముదాయాల ముందు ఉన్న వ్యర్థాలను ఆయా దుకాణాదారులే తొలగించాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. బుధవారం ఆమె 3వ జోన్ 21వ వార్డు పరిధిలోని బాలాజీ నగర్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దుకాణాల ముందు ఉన్న చెత్తను తొలగించాల్సిన బాధ్యత ఆ యాజమాన్యలదేనని, మూడు రంగుల చెత్త బుట్టలను తప్పనిసరిగా ప్రతి దుకాణం ముందు ఉండాలని, చెత్త బయట వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. రోడ్లు, కాలువలను శుభ్రం చేసి చెత్తను వెంటవెంటనే డంపింగ్ యార్డుకు తరలించాలని, తడి-పొడి చెత్తను ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి సేకరించాలని, చెత్త తరలించే వాహనము వెళ్లలేని ప్రదేశాలలో పుష్ కార్టులతో చెత్త సేకరించాలని, పిన్ పాయింట్ వారీగా పారిశుద్ధ సిబ్బందిని సర్దుబాటు చేసి ఎవరికి నిర్దేశించిన పనిని వారికే కేటాయించాలని శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. అపార్ట్మెంటులో ఉన్న వారు వ్యర్థాలను నేరుగా చెత్త తరలించే వాహనానికి అందించాలని. అపార్ట్మెంటులో మొక్కలు కట్ చేసి, రీమోడల్ చేసినప్పుడు వాటి వ్యర్థాలను అపార్ట్మెంటు ముందు వేస్తున్నారని, అలా వేస్తే భారీగా అపరాధ రుసుం వసూలు చేయాలని శానిటరీ ఇన్స్పెక్టరును ఆదేశించారు. సీజనల్ వ్యాధులు అయిన మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా సిబ్బందిని ఆదేశించారు. ఇంటికి అతికించిన స్టిక్కర్లను తీసేస్తున్నారు అని కొంతమంది స్టిక్కర్లను అతికించి నీవ్వడంలేదని సిబ్బంది తెలపగా ఈ మూడు నెలల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశము అధికంగా ఉన్నందున ఆ స్టిక్కర్లను తొలగించ వద్దని వారంలో ఒకరోజు మా సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి స్టిక్కర్లపై సంతకం చేస్తారని, కావున మా సిబ్బందికి సహకరించాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో మూడవ జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీర్లు చిరంజీవి, శ్రీనివాస్, ఎఎంఒహెచ్ రమణ మూర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెల్సన్, శానిటరీ సూపర్వైజర్ జనార్ధన్, మలేరియా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టరు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పరిషత్ ఫలితాలతో విపక్షాల్లో గుబులు

## ఏపీ దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ పరిషత్ ఎన్నికల ఫలితాల అనంతరం విపక్షాల్లో గుబులు మొదలయ్యింది అని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వైఎస్సార్‌సీపీ మినహా రాష్ట్రంలో మిగతా పార్టీలకు చోటు లేదని ప్రజలు మరో సారి రుజువు చేశారు. మాటల మనిషి కాదు చేతల మనిషి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు నిదర్శనమే పరిషత్ ఎన్నికల ఫలితాలు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే స్థితిలో లేరు. అందుకే నిమ్మకూరు, నారావారి పల్లేలో ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొట్టారు" అని తెలిపారు.

"రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ అసత్య ఆరోపణలు చేస్తోంది. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరు. అమరావతి పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. ఆయన గ్రాఫిక్స్‌ను ప్రజలు నమ్మలేదు. అందుకే పరిషత్ ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. పరిషత్ ఎన్నికల ఫలితాల్లో 80శాతం పైగా ఓట్లు మాకు వచ్చాయి. ఫలితాల తర్వాత ఇప్పుడు మేము బహిష్కరించాం అని జబ్బలు చరుచుకుంటున్నారు" అని వెల్లంపల్లి విమర్శించారు.

"చంద్రబాబు, లోకేష్‌ని మేము ప్రవాస ఆంధ్రులని అనుకుంటున్నాం. ఒక గెస్ట్ లాగా ఏపీకి వచ్చి గెస్ట్‌హౌస్‌లో ఉండి వెళతారు. సొంత కొడుకును చిత్తుగా ఓడించారని ప్రజల మీద చంద్రబాబుకు కోపం. ఫామ్‌హౌస్‌లలో కూర్చున్న వారు కూడా మాదక ద్రవ్యాల గురించి మాట్లాడుతున్నారు. పోలీస్ కమిషనర్ కూడా స్పష్టం చేశారు.. అయినా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. డ్రగ్స్ తీసుకున్న లక్షణాలు లోకేష్, బోండా ఉమాలాంటి వారికే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. లేదంటే గంజాయి వ్యాపారం చేసిన అయ్యన్నకు ఈ లక్షణాలు ఉన్నాయేమో" అని వెల్లంపల్లి విమర్శించారు.

# పెట్టుబడులతో వచ్చే వారికి స్వాగతం

## వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు



విజయవాడ: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకు తాము అని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎగుమతుల అవకాశాలపై ఆయన చర్చిం చారు. విజయవాడలో జరుగు తున్న వాణిజ్య ఉత్సవం కార్యక్రమం రెండురోజులో భాగంగా బుధవారం కన్నబాబు ప్రసంగించారు. సీఎం జగన్ పారిశ్రామికాభివృద్ధి కోసం సులభతరమైన పాలసీలను అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతున్నాం అన్నారు కన్నబాబు. "ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి , అనుబంధ రంగాల పరిశ్రమల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు.

సీఎం జగన్ సమర్ధవంతమైన పాలనలో కోవిడ్ సమయంలోనూ ఏపీలో ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. దేశం మొత్తం ఎగుమతుల్లో 5.8% వాటాతో ఎగుమతుల్లో 4వ ర్యాంకులో ఏపీ నిలిచింది. 2020-21లో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 172 మిలియన్ టన్నుల ఎగుమతులు జరిగాయి. ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టరులను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులకు అదనపు విలువ చేకూరుస్తున్నాం" అని కన్నబాబు తెలిపారు.

# గో - వెజ్జీస్ ఫ్రెస్ అండ్ నాచురల్ మాల్ ను ప్రారంభించిన వంశీకృష్ణ శ్రీనివాస్



ఆరిలోవ : వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ విశాలక్షినగర్ మెయిన్ రోడ్ లో గో - వెజ్జిస్ ఫ్రెస్ అండ్ నాచురల్ మాల్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ వెజిటబుల్, పండ్లు, డ్రై ఫ్రూట్స్, గ్రోసెరీ తో ఒకే మాల్ లో అందరికి అందుబాటు ధరలతో నిర్వాహకులు ఏర్పాటు చేశారని అన్నారు. వినియోగదారుల అభీష్టానికి అనుగుణంగా మరిన్ని సేవలతో విజయవంతం గా కొనసాగాలని తెలిపారు.

కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి స్వాతి దాస్, తూర్పు మహిళ అధ్యక్షరాలు కృపాజ్యోతి, కొయ్య కాశీ, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com